

గరిష్ఠం 27.5
కనిష్ఠం 17.0

ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	582 (288.7830)	15,272	15,272
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.20 (4.25)	722.10	1,031.04
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.193 (43.0123)	3,000	2,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.220

ఎన్నికల ఖర్చు విపరీతంగా పెరగడంతో గ్రామంలో క్రేజ్ ఉన్న సర్పంచ్ పదవికి పోటీచేసేందుకు కీలక నాయకులు, క్రియాశీల క కార్యకర్తలు జంకుతున్నారు. దశాబ్దాలుగా పార్టీకి నికార్సయిన కార్యకర్తగా ఉన్నా, ఎన్నికలకు వచ్చేసరికి డబ్బు ఖర్చుచేస్తేనే గెలుస్తారనే వాతావరణం వారి ఆశలకు తూట్లు పొడుస్తోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

ఖర్చులు మీరే.. భరించాలి!



- గెలిచివస్తే అభివృద్ధికి తోడ్పాటు ఇస్తాం
- స్పష్టం చేస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు
- ప్రతిపక్ష పార్టీలదీ అదే మాట
- పార్టీ నుంచి డబ్బుల్లేవని చెబుతుండడంతో ఖంగుతింటున్న ఆశావహులు
- పార్టీకి సేవచేసినా ఫలితం దక్కలేదనే నిర్వేదంలో సీనియర్లు

దశాబ్దాలుగా పార్టీ జెండా మోసి గుర్తింపు తెచ్చినా, ప్రస్తుత ఎన్నికల్లో పోటీ అవకాశం వస్తే అధినాయకులు ముందుండి అన్నివిధాలా అండగా ఉంటారనే నమ్మకంతో గ్రామ సీనియర్ నాయకులు ఉన్నారు. అయితే అలాంటి ఆశలేవీ పెట్టుకోవద్దని, సర్పంచ్ ఎన్నికల్లో అభ్యర్థులకు ఎవరికీ తాము డబ్బు, మద్యం అందించలేమని, గెలిచివస్తే అభివృద్ధి పనులు చేసిపెడతామని మంత్రులు, ఎమ్మెల్యే లు, ఇతర ప్రజాప్రతినిధులు తేల్చిచెబుతుండడంతో ఆశావహులు ఖంగుతింటున్నారు. అన్ని పార్టీల అధినాయకులు ఇదే చెబుతుండడంతో డబ్బులేని నాయకులు పోటీకి వెనకంజవేస్తున్నారు.

భారీ ఖర్చు తప్పదనే అంచనాలు

పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవికి పోటీచేసే అభ్యర్థుల ఖర్చు భారీగా పెరిగిపోయింది. గత పదేళ్లలో వచ్చిన మార్పులు, పదవి వస్తే చాలనే తలంపుతో పోటీపడే అభ్యర్థులు ఎంతకైనా తెగించి ఉన్న ఆస్తులను విక్రయించి గ్రామాల్లో సర్పంచులుగా పోటీచేసేందుకు సిద్ధమవుతుండడంతో ఖర్చుకు అదుపులేని పరిస్థితి నెలకొంది. చిన్నపంచాయతీల్లో సైతం ఒక్కో అభ్యర్థి గెలిచినా ఓడినా కనీసం రూ.10లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోందని, గెలిచే అభ్యర్థి ఇంకో రూ.2లక్షలు అదనంగా పెట్టకపోతే గెలవలేరని చెబుతున్నారు. పార్టీ క్యాడర్‌ని సైతం సంతృప్తిపరిస్తే తప్ప ఓట్లు పడని దుస్థితికి రాజకీయం చేరిందని సీనియర్ నాయకులు వాపోతున్నారు. మద్యం, మాంసం పంపిణీలతో పరిమితమవకుండా పోలింగ్‌కు ముందు రోజుల్లో నగదు పంపిణీ, చీరలు, వెండి భరిణెల వంటి పంపకాలు తప్పవని చెబుతున్నారు. ఓపెన్ కేటగిరీ, బీసీ రిజర్వేషన్లు అయినచోట్ల కొన్ని రాజకీయ ప్రతిష్ఠగలిగినచోట్ల, నియోజకవర్గాల్లో ద్వితీయ శ్రేణి నేతలుగా పోటీచేస్తున్న నాయకులు ఉన్నచోట్ల భారీగా ఖర్చుకు సిద్ధమైనట్లు గ్రామాల్లో చర్చసాగుతోంది.

ఏకగ్రీవాలు చేయాలన్నా కనీసం రూ.20లక్షల నుంచి ధర మొదలవుతోందని, ఆపై ఎవరు ఎక్కువ ఇస్తే వారికి సర్పంచ్ పదవిని ఇస్తున్నారని సమాచారం. ఉమ్మడి జిల్లాలో తొలివిడత ఎన్నికలు జరిగే గ్రామాల్లో ఇప్పటికే నామినేషన్ల సందర్భంగా ర్యాలీలకు వచ్చినవారికి దావతులు షరా అయ్యాయి. అదేవిధంగా ఏకగ్రీవాలయ్యే చోట్ల సమావేశాలు నిర్వహించా బేరాలు మాట్లాడి ఫైనల్ చేస్తున్నారు. మంత్రులు సహా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు అందరూ అభ్యర్థుల ఎంపికలో జోక్యం చేసుకోకుండా...

- మిగతా 8వ పేజీలో...

నామినేషన్ కౌంటర్ 1వ రోజు

జిల్లా	28న సర్పంచ్‌కు	ఇప్పటివరకు మొత్తం	వార్డు స్థానాలకు	ఇప్పటివరకు మొత్తం
నల్లగొండ	365	786	735	969
సూర్యాపేట	159	366	142	180
యాదాద్రి	176	381	648	782
మొత్తం	700	1533	1519	1931

విద్యుత్‌శాఖ టెండర్లలో గోల్‌మాల్!

రాత్రికి రాత్రే ఖరారు చేసిన వైనం

బంధువులకు పనులు కట్టబెట్టినట్లు ఆరోపణలు



జిల్లా విద్యుత్ శాఖలో టెండర్లలో గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పనులు చిన్నవే అయినా, వాటిని నిబంధనల ప్రకారం అప్పగించాల్సి ఉండగా, దొడ్డిదారిన రాత్రికి రాత్రే టెండర్లను ఖరారు చేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఓ అధికారి సమీప బంధువులకు, బినామీలకు పనులను కట్టబెట్టినట్లు వినవస్తోంది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ/ నల్లగొండ టౌన్)

పాతబడిన విద్యుత్ స్తంభాలను మార్చి తీగల ఏర్పాటు, ఇతర పనుల కోసం ఈనెల మొదటి వారంలో విద్యుత్‌శాఖ అధికారులు టెండర్లను పిలిచారు. వాటిని ఈ నెల 12వ తేదీనే ఖరారు చేయాల్సి ఉండగా, వివిధ కారణాలతో వాయిదా వేశారు.

జిల్లా కేంద్రంలో 11 కేవీఫీడర్ పనులతో పాటు, మరిన్ని పనుల కోసం రూ.1,45,448తో షార్ట్ టెండర్ పిలిచారు. అదేవిధంగా 1.25కిలో మీటర్ల 33/11కేవీ ఇంటర్ లింకింగ్ లైన్ పనులను మునుగోడు సబ్‌డివిజన్ పరిధిలోని గూడపూర్‌లో చేపట్టేందుకు రూ.1,56,445లతో టెండర్లను ఆహ్వానించారు. మునుగోడు పరిధిలోని చెల్మడలో ఎక్స్‌టెన్షన్ పనుల కోసం మరో రూ.1,24,703లతో టెండర్ల ను ఆహ్వానించారు. అయితే ఒక్కో పనికి 10 మంది చొప్పున మొత్తంగా 30మంది టెండర్లలో పాల్గొన్నారు.

లెస్ టెండర్ దాఖలుచేసిన వారిని కాదని

ప్రభుత్వ నిబంధన మేరుకు టెండర్లను ఖరారు చేయాల్సి ఉండగా, పలు కారణాలను చూపుతూ తక్కువ ధర కోట్‌చేసిన వారిని కాదని, అధిక ధర కోట్‌చేసిన వారికి కట్టబెట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ టెండర్లలో 8మంది వరకు 15శాతం తక్కువ ధర కోట్ చేసి టెండర్లు దక్కించుకోవాలని ప్రయత్నించగా, ముగ్గురు అధిక కోట్‌చేసినా వారికి...

- మిగతా 8వ పేజీలో...

నూతన ఉత్పత్తుల తయారీపై దృష్టి సారించాలి



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల సభ్యులు నూతన ఉత్పత్తుల తయారీపై దృష్టి సారించి, ఆర్థికంగా మరింత ముందుకు ఎదగాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహిస్తున్న భారతీయ కళా మహోత్సవ్‌కు జిల్లా నుంచి వెళుతున్న స్వయం సహాయక మహిళా సంఘాల అధ్యక్ష, కార్యదర్శుల ప్రత్యేక బస్సుకు శుక్రవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. కళా మహోత్సవ్‌లో దేశంలోని వివిధ ప్రాంతాల్లో తయారుచేసిన పలు రకాల ఉత్పత్తులను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పొదుపు, ఆర్థిక అంశాలతో పాటు, సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. జిల్లాలోని మహిళా స్వయం సహాయక సంఘాలు నూతన ఆలోచనలతో కొత్త ఉత్పత్తులను తయారు చేయడంపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఎస్పీ శరత్‌చంద్రపవార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్ చంద్రపవార్

నల్లగొండక్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పోలీస్ అధికారులు, సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ ఉద్యోగులు, కుటుంబసభ్యులకు మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు విధి నిర్వహణలో ఒత్తిడి కారణంగా సమయానికి ఆహారం, నిద్ర లేకపోవడం వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే అవకాశాలు ఉంటాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆరోగ్యం విషయంలో పలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతీరోజు వ్యాయామం, నడక, యోగా లాంటివి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఎస్‌బీ డీఎస్పీ మల్లారెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి, ఏఆర్‌డీఎస్పీ శ్రీనివాస్‌తో పాటు సాయికిరణ్, డాక్టర్ రమేష్, డాక్టర్ పుల్లారావు, డాక్టర్ రాజేష్, డాక్టర్ రవీంద్రనాథ్, ఫోకస్ రివర్ డయాగ్నస్టిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక సామర్థ్యం, క్రమశిక్షణను పెంపొందిస్తాయని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఇంటర్ కాలేజీ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ఓటమి గెలుపునకు నాంది అన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్ఐ సైదులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

నల్లగొండ, స్పోర్ట్స్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని, పాఠశాల స్థాయి నుంచే ఆసక్తి ఉన్న క్రీడల్లో శిక్షణ పొందాలని నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి, డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పీఎంశ్రీ పాఠశాలల జిల్లా స్థాయి క్రీడా పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉన్నత స్థాయి ఎదగవచ్చని అన్నారు. ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తుందని, విద్యార్థులు ఆటలకు సమయాన్ని కేటాయించాలన్నారు.

ఈ పోటీలకు జిల్లాలో 43 పీఎంశ్రీ పాఠశాలల నుంచి ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడలకు సంబంధించిన జట్లు పాల్గొన్నాయి. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ ఆటల్లో గెలుపొందిన జట్లను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. సుమారు 1000 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ డీవైఎస్‌వో, ఎస్‌జీఎఫ్-19 కార్యదర్శి కుంభం నర్సిరెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దగ్గుపాటి విమల, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనువాస్, నాగరాజు, శంభులింగం, బొమ్మపాల గిరిబాబు, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియను సమర్థంగా నిర్వహించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి

మర్రిగూడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను సమర్థంగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని క్లస్టర్ పరిధిలోని సరంపేట శివన్నగూడ, మర్రిగూడ, ఎన్నికల నామినేషన్ల కేంద్రాలను ఆమె తనిఖీ చేసి పరిశీలించారు. నామినేషన్ల కేంద్రాలకు వెళ్లి నామినేషన్ ధ్రువపత్రాలను పరిశీలించి, కంప్యూటర్ల సిస్టం పనితీరు వివరాలను చండూరు ఆర్డీవో శ్రీదేవిని అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ వేసిన అభ్యర్థుల ధ్రువపత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని, నామినేషన్ పత్రంలో నూతన బ్యాంక్ అకౌంట్‌ను కూడా పొందుపర్చే విధంగా చూడాలని, ఎలాంటి లోపాలు లేకుండా ఇబ్బందులకు తావివ్వకుండా చూడాలని అధికారులకు సూచించారు. కలెక్టర్‌తో ఎంపీడీవో మున్నయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో రవికుమార్, ఎంఈవో శ్రీనివాస్ ఉన్నారు.



సరంపేటలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

ఉపాధ్యాయురాలిగా కలెక్టర్

కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలుగా మారి కలెక్టర్ విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం బాలికల పాఠశాలలో విద్యార్థుతో ముచ్చటించారు. పూర్తయిన సిలబస్‌లో నుంచి విద్యార్థులను కలెక్టర్ ప్రశ్నలు అడిగారు. వసతి గృహంలో మెనూ పాటిస్తున్నారా? లేదా అని ఆరా తీశారు. ఒక విద్యార్థిని పుట్టినరోజును కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ జక్కరి శ్రీనివాసులు, ఎంపీడీవో మున్నయ్య ఉన్నారు.

చర్లగౌరారం నామినేషన్‌కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎస్పీ

కనగల్: మండలంలోని చర్లగౌరారం జీపీలో సర్పంచ్‌ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసిన నామినేషన్‌స్వీకరణ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా నిమినేషన్‌ప్రక్రియ సజావుగా సాగేందుకు కేంద్రం వద్ద తీసుకున్న భద్రత చర్యలను, బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేసారు. నామినేషన్‌కేంద్రంలోకి ధరావత్తులను సమర్పించే అభ్యర్థులను, వారిని ప్రతిపాదించే వారిని మాత్రమే అనుమతించాలన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లఘించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. వీరి వెంట చండూర్ సీఐ ఆదిరెడ్డి, వేద రక్షిత, ఎస్ఐ రాజీవ్‌రెడ్డి, కార్యదర్శులు సంతోష్, పద్మ, హరీష్ ఉన్నారు.

డిసెంబర్ 6న దేవరకొండకు సీఎం రేవంత్‌రెడ్డి రాక



దేవరకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిసెంబరు 6వ తేదీన రానున్నారు. దేవరకొండలో సీఎం బహిరంగ సభతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. కాగా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. సీఎం రాక సందర్భంగా దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఏర్పాట్లు చేస్తున్నారు. కొండమల్లేపల్లి మండలం పెద్దికల్ పహాడ్‌లో రూ.200 కోట్లతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ కళాశాలకు, రూ.442 కోట్లతో లైనింగ్ పనులకు, డిండి, ఎత్తిపోతలపథకం ఎదుళ్ల వెయిన్ కెనాల్‌కు రూ.1,800 కోట్లతో పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అలాగే నేరేడుగొమ్ములో రూ.47 కోట్లతో 132/33 కేవీ సబ్‌స్టేషన్, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ.28 కోట్లతో రోడ్ల నిర్మాణ పనులతో పాటు దేవరకొండ మున్సిపాలిటీలోరూ.20 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే బాలు నాయక్ తెలిపారు బహిరంగ ఎక్కడ నిర్వహిస్తారో అనేది ఖరారు కావాల్సి ఉంది.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

నల్లగొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సూచించారు. డీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన పున్నా కైలాస్ నేత శుక్రవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలిసి, గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని, పార్టీలో బలహీన వర్గాలకు పెద్దపీట వేయాలనే రాహుల్‌గాంధీ నిర్ణయం అమలు చేయడంలో భాగంగానే డీసీసీ అధ్యక్షుల నియామకాల్లో బీసీలకు పెద్దపీట వేశామని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లో కష్టపడిన కార్యకర్తలకు తప్పకుండా గుర్తింపు ఉంటుందనేందుకు కైలాస్‌నేత నియామకమే ఉదాహరణగా భావించాలని పీసీసీ అధ్యక్షుడు పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన కైలాష్‌ని అభినందించారు. వచ్చిన అవకాశాలను బాధ్యతగా భావించి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలందరి నుంచి మొదలుకొని సామాన్య కార్యకర్తల వరకు అందరి సూచనలు, సలహాలు తీసుకుంటూ రాహుల్ గాంధీ ఆశిస్తోన్న రీతిలో పార్టీని బలోపేతం చేయాలని కైలాష్‌కు పీసీసీ అధ్యక్షుడు సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను వాడవాడలా తెలియజేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో వందశాతం ఫలితాలు కాంగ్రెస్‌కు అనుకూలంగా వచ్చేలా పనిచేయాలని పీసీసీ అధ్యక్షుడు సూచించారు.



పీసీసీ అధ్యక్షుడిని గజమాలతో సత్కరిస్తున్న పున్నా కైలాష్, ఓయూ విద్యార్థి సంఘాల నాయకులు

తనపై నమ్మకంతో డీసీసీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీమంత్రి కుందూరు జానారెడ్డి, ఎంపీలు రఘువీర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వేముల వీరేశం, బాలూనాయక్, జైవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌ని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేసినట్లు తెలిపారు. అందరి సహకారం, సమన్వయంతో జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తానని కైలాస్‌నేత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కైలాస్‌ని అభినందించారు. చరణ్‌కౌశిక్‌యాదవ్, మానవతారాయ్, శ్రీహరినాయక్, లింగంయాదవ్, రాంబాబునాయుడు, సైదులుయాదవ్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో పొత్తుకు సీపీఐ సుముఖం

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

చండూరు, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ పార్టీల పొత్తు ప్రశ్నార్థకంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ కలిసి పనిచేసినా, ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా తమ పార్టీ కాంగ్రెస్‌తో పొత్తుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పొత్తు విషయంపై కాంగ్రెస్ పార్టీ నుంచి ఎలాంటి సంకేతాలు రావడం లేదని ఆ పార్టీ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సీపీఐ కొంత బలంగా ఉన్న మునుగోడు నియోజకవర్గంలో కూడా అన్ని స్థానాల్లో పోటీకి సిద్ధంగా ఉన్నామని, కానీ కాంగ్రెస్ పార్టీతో మిత్రబంధం కారణంగా సీట్ల సర్దుబాటు, పొత్తుల కోసం ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీతో పొత్తుకు తమ పార్టీ సుముఖంగా ఉన్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో తమ పార్టీ బలంగా ఉన్న చోట తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేసే అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు. తాము బలం లేని చోట కాంగ్రెస్ పార్టీకి, ఇతర వామపక్ష పార్టీలకు మద్దతు ఇస్తామన్నారు. కనీసం మునుగోడులో పొత్తుపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి వివరించగా ఇంకా స్పందించకపోవడం, నామినేషన్ల పక్రియ నేటితో ముగుస్తుండటంతో, ఇరు పార్టీలకు చెందిన కార్యకర్తలు, ఆశావాహులు ఆందోళన చెందుతున్నారు. వీలైన స్థానాల్లో సీపీఐ పోటీ చేస్తుందని, ఆ దిశగా ప్రతీ కార్యకర్త అత్యధిక స్థానాల్లో గెలుపొందేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మునుగోడు నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్న సీపీఐ ఎమ్మెల్సీ సత్యం క్షేత్రస్థాయిలో తమ పట్టు నిలుపుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. సీపీఐతో పొత్తుకు ప్రయత్నిస్తున్నానని, కొన్ని చోట్ల పొత్తు కుదరకపోతే స్నేహపూర్వకంగా తమ పార్టీ అభ్యర్థులు బరిలో ఉంటారని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వెల్లడించారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

దేవరకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించనున్న దీక్షాదివస్‌ను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కేసీఆర్ ఉద్యమ పోరాటం గత పదేళ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు గుర్తు చేయనున్నట్లు ఆయన తెలిపారు. దీక్ష దివస్ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఓపెన్ స్కూల్‌లో చదివి రాణించాలి

దేవరకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): చదువు మానేసిన వారు 10వ తరగతి, ఇంటర్ దూర విద్యలో పరీక్షలు రాసి ఉత్తీర్ణులై విద్యలో రాణించాలని జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సత్యమ్మ అన్నారు. శుక్రవారం దేవరకొండలో ఓపెన్‌స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో కళాజాత బృందం ఓపెన్‌స్కూల్ విద్యపై అవగాహన కల్పించి మాట్లాడారు. చదువుకుంటేనే భవిష్యత్ ఉంటుందన్నారు. పరీక్షలు రాసి 10వ తరగతి, ఇంటర్‌లో ఉత్తీర్ణులై డిగ్రీలు కూడ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, ఓపెన్‌స్కూల్ అధికారులు గీత, ప్రవీణ, దేవరకొండ మునిసిపల్ శానిటరి ఇన్స్‌పెక్టర్ సురిగి శంకర్, కళాకారులు, అధికారులు పాల్గొన్నారు.

సర్పంచ్ నెల వేతనం రూ.6,500 మాత్రమే!



1992 నుంచి అమల్లోకి..

(ఆంధ్రజ్యోతి-మోత్కూరు)

సర్పంచ్‌గా పోటీ చేయడానికి, గెలువడానికి పెద్దసంఖ్యలో ఆశావహులు ఉత్సాహపడుతుంటారు. సర్పంచ్ పదవి దక్కించుకోవడానికి రూ.లక్షల్లో ఖర్చు చేస్తున్నారు. వారి ఉత్సాహం, గెలుపొందడానికి వారు పెడుతున్న ఖర్చు చూసి ప్రజలు సర్పంచ్‌కు ఎంత వేతనమొస్తుందో, ఆ పదవి ద్వారా ఎంత ఆదాయం ఉంటుందో, అందుకే అంతగా ఖర్చు చేస్తున్నారని అనుకుంటుంటారు. రూ.లక్షలు ఖర్చు పెట్టి, ఒక్కొక్కరిని బతిమిలాడి, సర్పంచ్‌గా గెలిస్తే వారికి నెలకు వచ్చే వేతనం రూ.6,500 మాత్రమే. అది కూడా నెలనెలా రాదు. ఎప్పుడో ప్రభుత్వం గ్రాంటు ఇచ్చినప్పుడు తీసుకోవాలి. 1992కు ముందు సర్పంచ్‌లకు వేతనాలు లేవు. ఆ తర్వాత చిన్న గ్రామపంచాయతీ సర్పంచ్‌లకు రూ.600, మేజరు గ్రామపంచాయతీల సర్పంచ్‌లకు రూ.1000 మాత్రమే ఇచ్చేవారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటయ్యాక సీఎం కేసీఆర్ 2015 ఏప్రిల్ 1 నుంచి సర్పంచ్‌ల వేతనం రూ.5 వేలు చేశారు. ఆ తర్వాత 2021లో రూ.6500లకు పెంచారు. గతంలో గ్రామంలో అభివృద్ధి పనులు చేస్తే ఖర్చులన్నా వెళ్లేవి. 2018 తర్వాత నుంచి గ్రామాల్లో అభివృద్ధి పనులు చేసినా ప్రభుత్వ బిల్లులు చెల్లించకుండా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచడంతో చిల్లిగవ్వ ఆదాయం రాకపోగా పనులు చేయడానికి తెచ్చిన అప్పులకు వడ్డీలు మీదపడుతున్నాయని పలువురు వాపోతున్నారు.

మరీ ఇంత తక్కువ వేతనం, పనులు చేసినా పైసలు రాకపోయినప్పుడు అంత పోటీ ఎందుకు, అంత ఖర్చు చేస్తారంటే సర్పంచ్ ఆ గ్రా మానికి ప్రథమ పౌరుడు. ఆ హోదా, ఆ దర్పం, దర్జా దక్కించుకోవడం కోసం ఉన్నది అమ్మి అయినా సరే, అప్పులు చేసైనా సరేవిజయం సాధించాలని ఖర్చు చేస్తున్నారు.

ఏకగ్రీవాలకు అవకాశం

(ఆంధ్రజ్యోతి-తుర్కపల్లి)

గ్రామపంచాయతీ ఎన్నికలకు నామినేషన్ గడువు నేటితో ముగియనుండటంతో రాజకీ యం వేడెక్కింది. ఎన్నికలను ఏకగ్రీవం చేసుకుంటే పంచాయతీలకు ప్రభుత్వం రూ.10లక్షలు నజరానా ఇస్తామని ప్రకటించడంతో రాజకీయ పార్టీల నాయకులు దృష్టి సారించారు. పంచాయతీల్లో సర్పంచ్ పదవికి ఆశావహులు ప్రధాన పార్టీల నాయకులు, గ్రామ పెద్దలతో సమావేశాలు ఏర్పాటు చేసి ఏకగ్రీవం చేసేందుకు ముమ్మరంగా ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రభుత్వం అందించే నజరానాతో గ్రామాభివృద్ధి చేసుకుందామని పేర్కొంటున్నారు. అంతేకాకుండా గ్రామా ల్లో ఘర్షణలు ఉండవని, ప్రశాంతమైన వాతావరణం ఉంటుందంటున్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలోని వేలుపల్లి, కోనాపూర్ గ్రామాల్లో సర్పంచ్ పదవులు ఏకగ్రీవం చేసేందుకు ప్రయత్నిస్తున్నారు. అంతేకాకుండా రామోజీనాయక్‌తండా, గుజ్జవానికుంట ఎన్నికలు కూడా ఏకగ్రీవం చేసుకునేందుకు నా యకులు చర్చలు జరుపుతున్నట్లు సమాచారం. నేటి సాయంత్రంతో ఏ పంచాయితీలు ఏకగ్రీవమయ్యేదీ తేలిపోతుందని నాయకులు పేర్కొంటున్నారు. 2018లో జరిగిన పంచాయతీ ఎన్నికల్లో మండలంలోని రుస్తాపూర్, రామాజీనాయక్ తండా, బాబుల్‌నాయక్‌తండా, చోక్లతండా, బీల్యానాయక్ తండా పంచాయతీ ఎన్నికలను ఏకగ్రీవం చేసుకున్నారు.

అభ్యర్థులకు తలనొప్పిగా కరెంట్ అకౌంట్

నామినేషన్ల గడువు ముగియనుండటంతో అభ్యర్థుల్లో ఆందోళన



(ఆంధ్రజ్యోతి-తుర్కపల్లి): పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ పత్రాలతో పాటు బ్యాంక్ అకౌంట్‌ను సమర్పించాలని ప్రభుత్వం నిబంధన విధించింది. నామినేషన్ల గడువు ఈ నెల 29(నేడు)తో ముగియనుండడంతో బ్యాంక్ ఖాతాలు ఒక రోజులో ఎలా తీస్తామంటూ అభ్యర్థులు అధికారులను ప్రశ్నిస్తున్నారు. బ్యాంక్ అకౌంట్ తీసేందుకు ఆశావహులు బ్యాంక్‌ల ముందు బారులు తీరుతున్నారు. బాంక్ అధికారులు అకౌంట్ ఇచ్చేందుకు ఇబ్బందులు పెడుతున్నారని అభ్యర్థులు ఆరోపిస్తున్నారు. బ్యాంక్ ఖాతాతో పాటు కుల ధ్రువీకరణపత్రాలు, గ్రామపంచాయతీ నుంచి నోడ్యూస్ తదితర పత్రాల తీసుకోవాల్సి ఉండడంతో తమ సమయమంతా వృథా అవుతుందని వాపోతున్నారు. అభ్యర్థులకు పాత అకౌంట్ కాకుండా కొత్తగా కరెంట్ అకౌంట్ తీసుకోవాలని అధికారులు సూచిస్తుండటంతో అకౌంట్ తీయాలంటే రూ. 500 చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. యాదాద్రిభువనగిరి జిల్లా తుర్కపల్లి మండలంలో అధికసంఖ్యలో గిరిజనులు ఉండడంతో బ్యాంక్ ఖాతాలు తీసేందుకు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గతంలో తీసుకున్న పాత బ్యాంక్ ఖాతాలనే నామినేషన్‌కు వర్తింపచేయాలని అభ్యర్థులు కోరుతున్నారు.

దరఖాస్తు తిరస్కరించలేదు..

అభ్యర్థులు తప్పకుండా నామినేషన్ ప త్రాలతో పాటు కరెంట్ అకౌంట్ జత చే యాలి. ఎల్‌డీఎంకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిన దృష్ట్యా శనివారం బ్యాంక్‌లు పనిచేస్తాయి. అభ్యర్థులు బ్యాంక్ ఖాతాలు తీసుకోవాలి. ప్రస్తుతం బ్యాంక్ ఖాతా లేదని నామినేషన్‌ను తిరస్క రించడం లేదు. ఎన్నికల బరిలో ఉన్న అభ్యర్థులు మా త్రం తప్పకుండా కరెంట్ అకౌంట్ ఇవ్వాల్సి ఉంటుంది.

- లెంకట గీతారెడ్డి, ఎంపీడీవో, తుర్కపల్లి

రావిపహాడ్ రిజర్వేషన్‌పై

హైకోర్టులో పిల్

పాలకవీడు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : సూర్యాపేట జిల్లా పాలకవీడు మండలం రాగిపహాడ్ గ్రామపంచాయతీ ఎన్నికలపై హైకోర్టు స్టే ఇచ్చినట్లు అదే గ్రామనికి చెందిన హైకోర్టులో పిటిషన్ వేసిన గడ్డం సునీత శుక్రవారం తెలిపారు. గ్రామపంచాయతీలో లేని ఎస్సీ జనాభాను అధికారులు చూపించడంతో ఎస్సీ కేటగిరికి రిజర్వు అయిందని, దీంతో గ్రామంలో ఉండే బీసీలకు అన్యాయం జరిగిందని న్యాయవాది కరుణాకర్‌రెడ్డి ద్వారా మూడురోజుల కిందట హైకోర్టులో పిటిషన్ దాఖలు చేసినట్లు తెలిపారు. 2011 జనాభా లెక్కల ప్రకారం రావిపహాడ్ గ్రామ పంచాయతీలో మహంకాళి గూడెం, భవానీపురం, రావిపహాడ్‌లు కలిసి ఉండేవి. అప్పటి ఎస్సీ ఓటర్ల జనాభా 373 మంది ఉన్నారు. కానీ 2019లో 252 ఎస్సీ ఓటర్లు ఉన్న మహంకాళిగూడెంను పంచాయతీగా ఏర్పాటు చేశారు. ఆ తర్వాత రావిపహాడ్ పంచాయతీలో ప్రస్తుతం ఎస్సీ ఓటర్లజనాభా 121 మాత్రమే, ఇటీవల సర్పంచ్ ఎన్నికలకు 2011 జనాభా లెక్కల ప్రకారం తీసుకోవడంతో ఎస్సీ కేటగిరికి రిజర్వ్ అయిందన్నారు. దీంతో బీసీలు ఎక్కువగా ఉన్న రావిపహాడ్ గ్రామ పంచాయతీకి అన్యాయం జరిగిందన్నారు. హైకోర్టులో పూర్తి ఆధారాలతో వాదనలు విన్న హైకోర్టు తప్పుడు డేటాను సవరించి రిజర్వేషన్ల ప్రకియను మార్చాలని స్టే ఇచ్చినట్లు తెలిపారు. ఈ విషయంపై పాలకవీడు ఎంపీడీవో లక్ష్మిని వివరణ కోరగా ఉన్నతాధికారుల నుంచి ఎలాంటి ఉత్తర్వులు కాపీ రాలేదన్నారు.

అక్రమ మద్యం పట్టివేత

వలిగొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా నిల్వ చేసిన మద్యాన్ని యాదాద్రిభువనగిరి జిల్లా వలిగొండ పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ యుగేందర్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం వలిగొండకు చెందిన లింగస్వామి కిరాణా దుకాణాన్ని నిర్వహిస్తున్నాడు. ఎలాంటి అనుమతులు లేకుండా దుకాణంలో మద్యాన్ని విక్రయిస్తున్నట్లు సమాచారం మేరకు తనిఖీ చేశారు. తనిఖీల్లో ఎనిమిది బీర్లు, విస్కీ ఒకటి, ఆఫీసర్ చాయిస్ ఫుల్‌బాటిల్, 16 క్వార్టర్లు, 90 ఎంఎల్ బాటిళ్లు 8 గుర్తించారు. సుమారు 10.55 లీటర్ల మద్యం విలువ రూ.7,185గా అంచనా వేశారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

వీధికుక్కల దాడిలో 22 గొర్రెపిల్లలు మృతి

నల్లగొండ క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నల్లగొండ మండలంలోని దండెంపల్లి గ్రామంలో గురువారం రాత్రి వీధికుక్కల దాడిలో 22 గొర్రెపిల్లలు మృతి చెందాయి. గ్రామానికి చెందిన సైదులు తన గొర్రెపిల్లలను కొట్టంలో కట్టివేయగా ఇతర ప్రాంతాల నుంచి తీసుకువచ్చిన వీధికుక్కలను గ్రామంలో వదిలేయడంతో దాడి చేసి చంపాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. చనిపోయిన గొర్రెపిల్లలను తీసుకెళ్లి పంచాయతీ ఎదుట వేసి నిరసన తెలిపారు.

నేత్రదానం మహాదానం

మిర్యాలగూడ టౌన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : నేత్రదానం మహాదానమని వాసవీ క్లబ్ ఆర్గాన్ డొనేషన్ చైర్మన్ మిట్టపల్లి విజయభాస్కర్ అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా మిర్యాలగూడ పట్టణంలోని వాసవీనగర్‌లో మాట్లాడుతూ పట్టణ ప్రముఖుడు రంగా విశ్వనాథం(76) మృతి చెందగా కుటుంబసభ్యుల అంగీకారం మేరకు కంటిపాపలను స్వీకరించినట్లు తెలిపారు. అవయవ, రక్త, నేత్రదానాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలన్నారు. కాగా విశ్వనాథం మృతికి రైస్‌మిల్లర్స్, కిరాణ, ధాన్య వ్యాపారులు సంతాపం ప్రకటించారు. కార్యక్రమంలో కర్నాటి రమేష్, బచ్చులకూర రమేష్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కుల ధ్రువీకరణ సర్టిఫికెట్ల జారీకి సర్వర్ సమస్య

- ఒక్కో దరఖాస్తుకు 20 నిమిషాల సమయం
- సర్టిఫికెట్ల కోసం గంటల తరబడి వేచి ఉన్న పోటీదారులు



నార్కట్‌పల్లిలోని మీ సేవా కేంద్రం వద్ద కుల ధ్రువీకరణ పత్రాల కోసం వేచి ఉన్న జనం

నార్కట్‌పల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా నామినేషన్ల దాఖలులో జతపర్చాల్సిన కుల ధ్రువీకరణ పత్రాల జారీకి సర్వర్ సమస్య ఎదురవుతోంది. సర్వర్ నెమ్మదించడంతో కుల ధ్రువీకరణ పత్రాల కోసం ఆశావహులు గంటల తరబడి ఇటు మీ సేవా అటు రెవెన్యూ కార్యాలయాల్లో పడిగాపులు కాయాల్సి వస్తోంది. గ్రామపంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ లేదా వార్డుస్థానాలకు పోటీ చేస్తున్న షెడ్యూల్డ్ కులాలు, తెగలు, వెనుకబడిన తరగతులకు చెందిన అభ్యర్థులు నామినేషన్ ఫారంతో పాటే కులధ్రువీకరణ పత్రం ఖచ్చితంగా జతపర్చాల్సి ఉంది. దీంతో మండలవ్యాప్తంగా పంచాయతీ ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఆసక్తితో ఉన్న అభ్యర్థులు కులధ్రువీకరణ పత్రాల కోసం మూడు రోజులుగా మీ సేవలో దరఖాస్తు చేసుకుంటున్నారు. రెవెన్యూ అధికారులు కూడా వీటి తక్షణ జారీకి ప్రాధాన్యమిచ్చారు. అయితే శుక్రవారం సర్వర్ నెమ్మదించడంతో కుల ధ్రువీకరణ పత్రాల జారీకి తీవ్ర ఆటంకం ఏర్పడింది. బీసీలకు గతంలో జారీ చేసిన తాజా డిజిటల్ కుల ధ్రువీకరణ పత్రాన్ని తీసుకువస్తే ఆ పత్రంపై ఉన్న డిజిటల్ నెంబర్ ఆధారంగా రెండో నిజప్రతిని మీ సేవ నుంచే పొందే వీలు కల్పించారు. కానీ ఎస్సీ,ఎస్టీలకు మాత్రం గతంలో డిజిటల్ కుల ధ్రువీకరణ పత్రం ఉన్నా బీసీల మాదిరిగా డిజిటల్ నెంబర్‌పై 2వ నిజప్రతి ఇవ్వడానికి అవకాశం కల్పించలేదు. దీంతో తాజాగా దరఖాస్తు చేయాలనే నిబంధనే పెట్టడంతో దరఖాస్తుల సంఖ్య ఎక్కువై సర్వర్ నెమ్మదించింది.

నామినేషన్‌పై డీటీ సంతకంతో ధ్రువీకరణ

నామినేషన్ల దాఖలుకు శనివారంతో సమయం ముగుస్తుండటం సర్వర్ సమస్యతో డిజిటల్ కుల ధ్రువీకరణ పత్రాల జారీకి ఆటంకం ఏర్పడుతుండటంతో ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులకు నష్టం జరగకుండా జిల్లా అధికార యంత్రాంగం ఈ సమస్యకు పరిష్కారం చూపింది. మీ సేవలో దరఖాస్తు చేసుకుని డిజిటల్ ధ్రువీకరణ పత్రాలు పొందేందుకు ఎదురైన కుల ధ్రువీకరణ పత్రాల జారీకి ప్రత్యామ్నాయం చూపింది. అభ్యర్థులు తమ పాత కుల ధ్రువీకరణ పత్రాలు తీసుకువస్తే వాటిని పరిశీలించి సదరు అభ్యర్థి కులాన్ని ధ్రువీకరిస్తూ నామినేషన్ పత్రాలపై నాయబ్ తహసీల్దార్ సంతకం చేస్తే నామినేషన్ చెల్లుబాటయ్యేలా వీలు కల్పించింది. సర్వర్ సమస్యతో కుల ధ్రువీకరణ పత్రం పొందలేమనే ఆందోళనలో ఉన్న అభ్యర్థులకు అధికారులు చూపిన ప్రత్యామ్నాయ వెసులుబాటు ఊరట నిచ్చింది.

న్యాయం చేయాలంటూ అత్తారింటి ఎదుట ధర్నా



అత్తామామల ఇంటి ఎదుట కుమారుడితో కలిసి ధర్నా చేస్తున్న సౌందర్య

మిర్యాలగూడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తనకు న్యాయం చేయాలంటూ నాలుగేళ్ల కుమారుడితో కలిసి అత్తారింటి ఎదుట కోడలు ధర్నాకు దిగింది. ఈ సంఘటన నల్లగొండ జిల్లా మిర్యాలగూడలో జరిగింది. వివరాల్లోకి వెళితే పట్టణంలో బంగారుగడ్డకు చెందిన భాస్కర శ్రీనివాస్, మంజుల దంపతులకు ఏకైక కుమారుడు భాస్కర సాయిదీప్ నల్లగొండ చర్లపల్లికి చెందిన సౌందర్య అలియాస్ పల్లవిని ప్రేమించి ఐదేళ్ల క్రితం వివాహం చేసుకున్నాడు. వీరికి మోక్షిత్ అనే నాలుగేళ్ల కుమారుడు ఉన్నారు. ఇరువురు స్థానిక చింతపల్లి ఇందిరమ్మ కాలనీలో నివసిస్తున్నారు. సాయిదీప్, సౌందర్య దంపతుల మధ్య కుటుంబతగాదాలు నెలకొనడంతో 50 రోజుల క్రితం భార్యను, కుమారుడిని బంగారుగడ్డలోని తల్లిదండ్రుల ఇంటి వద్ద వదిలేసి వెళ్లాడు. తన కుమారుడు ఇప్పటివరకు ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితులు ఇతరచోట్ల విచారించారు. అయినప్పటికీ అతడి ఆచూకీ దొరకలేదు. దీంతో ఆగ్రహించిన అత్తామామ తన కుమారుడు కనిపించకుండా పోవడానికి కోడలు సౌందర్య కారణమని ఇంట్లో ఉన్న కోడలును, మనుమడిని గురువారం ఇంటి నుంచి బయటకు గెంటివేసిందని స్థానికులు తెలిపారు. దీంతో రాత్రంతా చలిలోనూ వారిద్దరూ ఇంటిముందే నిద్రించారు. విషయం తెలుసుకున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు పోలెబోయిన వరలక్ష్మీ ఆధ్వర్యంలో కోడలు సౌందర్యకు మద్దతు తెలిపారు. సౌందర్యకు న్యాయం చేయాలని ధర్నా చేశారు. పోలీసులు, అధికారులు సౌందర్యకు న్యాయం చేయాలని కోరారు. తనకు న్యాయం జరిగే వరకూ తన కుమారుడితో కలిసి ఉంటానని తెలిపింది. ఆందోళనలో ఐద్వా జిల్లా సహాయ కార్యదర్శి పాదూరి గోవర్ధన్, జిల్లా కమిటీ సభ్యులు అరుణ, కౌసల్య పాల్గొన్నారు. రాత్రి పొద్దుపోయే వరకూ కుమారుడితో కలిసి సౌందర్య ఆందోళన కొనసాగిస్తోంది.

సౌందర్య నుంచి ప్రాణహాని

మిర్యాలగూడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : తన మనవడి భార్య సౌందర్యతో తమకు ప్రాణహాని ఉందని ఆమె నుంచి రక్షణ కల్పించాలని వృద్ధ దంపతులు (సౌందర్య భర్త నానమ్మ, తాత) సబ్‌కలెక్టర్‌ను కలిసి శుక్రవారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తన మనవడు సాయిదీప్ ప్రేమించి సౌందర్యను వివాహం చేసుకున్నాడని, ఇప్పుడు కనిపించకుండా పోయాడన్నారు. సుమారు రెండు నెలలు కావస్తున్నా ఇంతవరకు ఆచూకీ తెలియరాలేదన్నారు. మా కుమారుడు, కోడలితో బంగారుగడ్డలో కలిసి ఉంటున్నా ఇంటి ముందు ఇప్పుడు మనుమని భార్య ధర్నా చేస్తూ మముల్ని బయటకు రాకుండా దుర్భాషలాడుతోందన్నారు. ఆమె నుంచి ప్రాణానికి ముప్పు ఉందని రక్షణ కల్పించాని కోరారు.

నాటుసారా తయారీ కేంద్రాలపై దాడులు



బెల్లంపానకాన్ని ధ్వంసం చేస్తున్న పోలీసులు

మఠంపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలంలో నాటుసారా తయారీ కేంద్రాలపై పోలీసులు శుక్రవారం దాడులు చేశారు. పాతదొన బండతండా సమీపంలోని పొలంలో సారా తయారీ బట్టీలు ఉన్నాయనే సమాచారంతో ఎస్ఐ బాబు ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. అ దాడుల్లో 50 లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేశారు. సారాతయారీ చేస్తున్న మాలోతు పీక్‌ను అదుపులో తీసుకొని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

విద్యుత్ కనెక్షన్ కోసం లంచం డిమాండ్

తుంగతుర్తి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి విద్యుత్ కనెక్షన్ కావాలంటే రూ.50వేలు ఇవ్వాలని లైన్‌మన్ డిమాండ్ చేశారని అతడిపై చర్యలు తీసుకోవాలని మెంతోబయిన మనీషా కోరారు. సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండలకేంద్రంలో తనకు మంజూరైన ఇందిరమ్మ ఇల్లు నిర్మాణం చేసుకుంటున్నానని, విద్యుత్ కనెక్షన్ కోసం అధికారులను సంప్రదించగా రూ. 80వేలు ఖర్చవుతుందని తెలిపారని అన్నారు. ప్రశ్నించడంతో ఇక్కడి వారే కాబట్టి రూ.50వేలు వరకు ఖర్చువుతుందని చెప్పి రూ.50వేలు వసూలు చేసినట్లు తెలిపారు. ఆ తర్వాతే విద్యుత్ కనెక్షన్ ఇచ్చారన్నారు. తమకు డబ్బులు తిరిగి ఇప్పించాలని ఏఈ, డీలకు ఫిర్యాదు చేసినట్లు ఆమె తెలిపారు. ఏఈ సురేందర్‌ను వివరణ కోరగా లైన్‌మన్ వ్యవహారం తన దృష్టికి వచ్చిందని రేపు ఫీల్డ్ విజిట్ చేసి బాధితురాలికి న్యాయం చేస్తానన్నారు.

ఆర్టీసీ బస్సు ఢీకొని వృద్ధ రైతు మృతి



లక్ష్మయ్య(ఫైల్)

భువనగిరి రూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): డ్రైవర్ నిర్లక్ష్యంతో ఆర్టీసీ బస్సు ఢీకొని ఓ వృద్ధ రైతు మృతి చెందాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా భువనగిరి మండలం చందుపట్ల గ్రామశివారులో శుక్రవారం జరిగింది. భువనగిరి రూరల్ ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. చందుపట్ల గ్రామ పరిధిలోని కుమ్మరిగూడెం ప్రాంతానికి చెందిన దొమ్మాట లక్ష్మయ్య(70) నడుచుకుంటూ వ్యవసాయ బావి వద్దకు వెళ్తున్నాడు. యాదగిరిగుట్ట డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గట్టుసింగారం నుంచి హైదరాబాద్‌కు వెళ్తూ కుమ్మరిగూడెం వద్ద లక్ష్మయ్యను వెనుక నుంచి ఢీకొట్టింది. వెంటనే స్థానికులు లక్ష్మయ్యను హుటాహుటిన 108 వాహనంలో భువనగిరిలోని జిల్లా కేంద్ర ఆసుపత్రికి తరలించారు. అప్పటికే లక్ష్మయ్య మృతి చెందాడని వైద్యులు నిర్ధారించారు. కాగా లక్ష్మయ్య కుమారుడు వెంకటేశ్ ఫిర్యాదుమేరకు బస్సు డ్రైవర్ స్వామిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌హెచ్‌వో అనిల్‌కుమార్ తెలిపారు. రోడ్డు ప్రమాదంలో లక్ష్మయ్య మృతి చెందాడని తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి శుక్రవారం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి లక్ష్మయ్య మృత దేహం వద్ద నివాళులర్పించారు. ఆయన వెంట పీఏసీఎస్ మాజీ చైర్మన్ బల్గూరి మధుసూదన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ చిన్నం పాండు, నాయకులు జమ్ముల రమేశ్, కంకల కిష్టయ్య ఉన్నారు.

గుర్తుతెలియని వాహనం ఢీకొని యువకుడి



అనిల్(ఫైల్)

గరిడేపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : గుర్తుతెలియని వాహనం ఢీకొని యు వకుడు మృతి చెందాడు. ఈ ఘటన గురువారం రాత్రి సూర్యాపేట జిల్లా గరిడేపల్లి మండలంలో జరిగింది. ఏఎస్ఐ జగన్నాథం తెలిపిన వివరాల ప్రకారం పెన్‌పహాడ్ మండలం దూపాడు గ్రామానికి చెందిని పిన్నాని అనిల్(33) దూపాడు గ్రామంలో కిరాణం దుకాణం నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి అనిల్ తన సొంత పనుల నిమిత్తం ద్విచక్రవాహనంపై గరిడేపల్లికి వచ్చి ఇంటికి వెళ్తున్నాడు. ఈ సమయంలో మార్గమధ్యలోని పొనుగోడు గ్రామశివారులోని హెచ్‌పీ పెట్రోల్ బంక్ దాటగానే గరిడేపల్లి నుంచి సూర్యాపేట వైపు వెళ్తున్న గుర్తుతెలియని వాహనం ఢీకొని అనిల్ తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడని ఏఎస్ఐ జగన్నాథం తెలిపారు. అనిల్‌కు 8 నెలల పాప, భార్య ఉన్నారు. తండ్రి కృష్ణయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దరర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ తెలిపారు.

రేపు ఇంటికి వెళ్లాల్సి ఉండగా..

కనగల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కనగల్ గ్రామశివారులో విద్యుదాఘాతానికి గురై వరికోత యంత్రం డ్రైవర్ మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. తమిళనాడు రాష్ట్రం తిరువణ్ణామలై జిల్లా అరని పాలతంగళ్లకు చెందిన నిత్యానందం(23) నెల రోజుల నుంచి తమిళనాడుకు చెందిన వరి కోత యంత్రంపై డ్రైవర్‌గా కనగల్ గ్రామంలో ఉంటూ పనిచేస్తున్నాడు. శుక్రవారం ఉదయం 10గంటల సమయంలో గ్రామ శివారులోని మునగాల గోపాల్ పొలంలో వరి కోస్తుండగా యంత్రానికి కరెంట్ తీగలు అడ్డువచ్చాయి. ఈ క్రమంలో వాటిని తొలగించే ప్రయత్నంలో నిత్యానందం విద్యుదాఘాతానికి గురయ్యాడు. ఎడమచేయి కాలి గాయాలై వాలిపోయాడు. స్థానికులు గమనించి 10 నిమిషాల అనంతరం అతడిని యంత్రం నుంచి కిందికి దించి సీపీఆర్ చేసి బతికించే ప్రయత్నం చేశారు. కానీ అప్పటికే అతడు మృతి చెందటంతో ఫలితం దక్కలేదు. ట్రాన్స్‌కో ఏఈ ఆర్ఎస్‌కే కుమార్ విద్యుత్‌సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని వివరాలను నమోదు చేసుకున్నారు. పోలీసులు నిత్యానందం మృతదేహన్ని పోస్టుమార్టం నిమిత్తం నల్లగొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వరికోతల సీజన్‌కావడంతో నెలరోజుల క్రితం వచ్చిన నిత్యానందం శనివారం స్వస్థలానికి వెళ్లాల్సి ఉంది. చివరిరోజు విధుల్లో ప్రమాదానికి గురై ప్రాణాలు కోల్పోయాడని తోటి డ్రైవర్లు కన్నీరుమున్నీరయ్యారు. అయితే నిత్యానందం కుటుంబ సభ్యులు తమిళనాడు నుంచి రావాల్సి ఉందన్నారు. ఈ సంఘటనపై ఎలాంటి ఫిర్యాదు అందలేదని ఎస్ఐ రాజీవ్‌రెడ్డి తెలిపారు.

అనుమానాస్పదస్థితిలో యువకుడు..

సూర్యాపేట క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): అనుమానాస్పద రీతిలో యువకుడు మృతి చెందాడు. సూర్యాపేట జిల్లా కేంద్రంలో శుక్రవారం జరిగింది. పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్య, బాధిత కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం పట్టణంలోని తిరుమలనగర్‌లోని ఓ ఇంట్లో అద్దెకు నివాసముంటున్న దాచేపల్లి మణికంఠ(19) పట్టణంలోని ఓ ప్రైవేట్ జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుతున్నాడు. తనతో పాటు తన తల్లి లక్ష్మి కూడా ఉంటోంది. మణికంఠ తల్లి కలెక్టరేట్‌లో అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో పనిచేస్తోంది. అయితే మధ్యాహ్నం మణికంఠ వారు నివాసముంటున్న ఇంట్లో ఫ్యాన్‌కు ఉరేసుకుని మృతి చెందాడు. ఆ సమయంలో అతడితో పాటు వారి ఇంట్లో ఉన్న మరో యువతి వెంటనే ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి తరలించింది. పరీక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. విషయం తెలుసుకున్న మణికంఠ తల్లి, కుటుంబ సభ్యులు మణికంఠ మృతిపై అనుమానాలు ఉన్నాయని సమగ్ర దర్యాప్తు జరిపి మృతికి గల కారణాలు తెలపాలని కోరుతూ పట్టణ ఇన్‌స్పెక్టర్ వెంకటయ్యకు ఫిర్యాదు చేశారు. వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

గీత కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలు అమలుచేయాలి



మాట్లాడుతున్న కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ



పట్టంలో ర్యాలీ నిర్వహిస్తున్న గీత కార్మికులు

సూర్యాపేట అర్బన్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి) : ఎన్నికల ముందు కాంగ్రెస్ పార్టీ కల్లుగీత కార్మికులకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే అమలుచేయాలని కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎంవీ రమణ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన కల్లుగీత కార్మికుల రణభేరీ బహిరంగ సభలో ఆయన మాట్లాడారు. జనగామ జిల్లాకు సర్వాయి పాపన్న జిల్లాగా నామకరణం చేయాలన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి రెండేళ్లు అవుతున్నా నేటికీ కల్లుగీత కార్మికులకు ఇచ్చిన ఏ ఒక్క హామీని అమలు చేయకపోవడం దారుణమన్నారు. కల్లుగీత కార్మికులకు ఇస్తున్న పింఛన్‌ను రూ. 2వేల నుంచి రూ.4వేలకు పెంచుతామని చెప్పిన కాంగ్రెస్ పార్టీ నేటికీ అమలు చేయలేదన్నారు. కల్లుగీత కార్మికులకు ఎక్స్‌గ్రేషియా రూ. 5లక్షలు ఇస్తుందని, పార్టీ అధికారంలోకి వచ్చాక రూ.10లక్షలు ఇస్తామని చెప్పిన సీఎం రేవంత్‌రెడ్డి మాట తప్పారన్నారు. మల్లన్నసాగర్ ముంపులో ఇళ్లు కోల్పోయిన వారికి ఇళ్లు నిర్మించి వృత్తి, ఉపాధి కల్పించాలన్నారు. ప్రతీ సొసైటీకి రూ. 20లక్షల కేటాయించాలన్నారు. బీజేపీ ప్రభుత్వం కేవలం కార్పొరేట్ శక్తుల లాభాల కోసం తప్ప కల్లుగీత కార్మికుల సంక్షేమాన్ని పట్టించుకోవడం లేదన్నారు. కల్లుగీత వృత్తి చేసేవారందరికీ కాటమయ్య రక్షణ కవచం ఇవ్వాలన్నారు. అంతకుముందు జిల్లా కేంద్రంలో భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బెల్లంకొండ వెంకటేశ్వర్లు, డాక్టర్ శిగ విజయ్‌కుమార్, సింగర్‌లు మానుకోట ప్రసాద్, సందీప్, శ్రీకాంత్, నాయకులు ఎల్గూరి గోవింద్, చౌగాని సీతారాములు, జయరాములు, బైరు వెంకన్నగౌడ్, గౌని వెంకన్న, వెంకటమల్లయ్య, రమేష్‌గౌడ్, గోపి, అచ్చాలు, వెంకటనర్సయ్య, బండకింది అరుణ్, అంజయ్య, కక్కిరేణి నాగయ్య, టైసన్ శ్రీను, నగేష్, అంజిబాబు, జనార్ధన్, సైదయ్య, బిక్షం, జయమ్మ, జ్యోతి, వెంకన్న, కృష్ణ పాల్గొన్నారు.

మద్యం దుకాణాన్ని తొలగించాలి



చండూరులో మద్యం దుకాణం ఎదుట ధర్నా చేస్తున్న ప్రజలు

- మద్యం దుకాణం ఎదుట మహిళల ధర్నా

చండూరు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జనావాసాల మధ్య ఉన్న మద్యం దుకాణాలను వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తూ స్థానికులు రాస్తారోకో చేపట్టారు. ఈ సంఘటన నల్లగొండ జిల్లా చండూరులో శుక్రవారం జరిగింది. ఈ సందర్భంగా చండూరు 2వ వార్డు ప్రజలు మాట్లాడుతూ, జనావాసాల మధ్య ఉన్న మద్యం దుకాణాలను తొలగించాలని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బస్టాండ్ సమీపంలోనే వైన్స్ ఏర్పాటుతో పరిసర కాలనీల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నిత్యం మహిళలు, విద్యార్థులు రాకపోకలు సాగించే రోడ్డులో మద్యం దుకాణం ఏర్పాటుతో మల, మూత్ర విసర్జన చేస్తూ, అల్లర్లకు పాల్పడుతూ, భయభ్రాంతులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. మద్యం మత్తులో ఇళ్లలోకి చొరబడి భయాందోళనలకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే సమస్యను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ప్రధాన రహదారిపై బీష్మించుకు కూర్చున్నారు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలికి చేరుకొని ఆందోళన చేస్తున్న వారికి సర్దిచెప్పి ధర్నా విరమింపజేశారు. కార్యక్రమంలో స్థానికులు ఏకాలపు అంజనేయులు, పగిళ్ల పవన్, నాగిళ్ల నరేష్, పగిళ్ల ప్రశాంత్, బోడ రాజు, దుబ్బ వెంకన్న, జావీద్, ఎక్బాల్, ఏకాలపు అంతమ్మ, నాగిళ్ల నిర్మల, బొమ్మరగోని హరిక, కమ్రూబేగం, రూప, నాగిళ్ల లలిత మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌పీఎల్‌-6ను సద్వినియోగం చేసుకోవాలి

● ఎమ్మెల్సీ కేతావత్‌ శంకర్‌నాయక్‌



టోర్నీని ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ శంకర్‌నాయక్‌

నల్లగొండటౌన్‌, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నల్లగొండ ప్రీమియర్‌ లీగ్‌ (ఎన్‌పీఎల్‌)-6ను క్రీడాకారులు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్సీ కేతావత్‌ శంకర్‌నాయక్‌ అన్నారు. నల్లగొండ పట్టణంలోని ఎన్జీ కళాశాల మైదానంలో గురువారం మునిసిపల్‌ మాజీ చైర్మన్‌ బుర్రి శ్రీనివా‌స్‌రెడ్డి, కాంగ్రెస్‌ పట్టణ అధ్యక్షుడు గుమ్ముల మోహన్‌రెడ్డితో కలిసి ఎన్‌పీఎల్‌-6 క్రికెట్‌ టోర్నీని ఆయన ప్రారంభించి మాట్లాడారు. ప్రతీక్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలతోపాటు క్రీడా పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంత క్రీడాకారుల ప్రతిభను వెలికితీయడానికి ఇలాంటి పోటీలు ఎంతో దోహదపడతాయని అన్నారు. ఇందులో నైపుణ్యం సాధించిన క్రీడాకారులు ఐపీఎల్‌ లాంటి టోర్నమెంట్‌లో పాల్గొనడానికి అవకాశం లభిస్తుందన్నారు. మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి నల్లగొండ నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడంతో పాటు ప్రతీక్‌ ఫౌండేషన్‌ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేపడుతున్నారని అన్నారు. ఈ టోర్నమెంట్‌తో 20 రోజుల పాటు క్రీడాభిమానులకు పండుగ అన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన ప్రథమ విజేతకు రూ.2,22,222, ద్వితీయ స్థానంలో నిలిచిన జట్టుకు రూ.1,11,111 నగదు బహుమతిని మంత్రి వెంకటరెడ్డి అందజేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్లు ప్రదీప్‌ నాయక్‌, కేసాని వేణుగోపాల్‌రెడ్డి, టోర్నమెంట్‌ ఆర్గనైజర్లు బోనగిరి ప్రభాకర్‌, ముత్తినేని నాగేశ్వరరావు, పాలకూరి శ్రీధర్‌, సుదరగోని రమేష్‌, సయ్యద్‌ అనష్‌, సముద్రాల శంకర్‌, పోగుల సాయి, నాళ్ల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శుభకార్యాలకు కేరాఫ్... కోటమైసమ్మ .. ఏరియా

● దినదినాభివృద్ధి చెందుతున్న ప్రాంతం
● మస్తుగా వెలిసిన ఫంక్షన్‌ హాళ్లు, వెంచర్లు
● రూ.కోట్లు పలుకుతున్న భూముల ధరలు
● ఉపాధి పొందుతున్న స్థానికులు

నిడమనూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా నిడమనూరు మండలం ఇండ్ల కోటయ్యగూడెం సమీపంలో ప్రసిద్ధిచెందిన కోటమైసమ్మ ఆలయ ప్రాంతం రోజురోజుకూ దినదినాభివృద్ధి చెందుతోంది. మూడు దశాబ్దాల క్రితం కోటమైసమ్మ ఆలయ పరిసరాలు మామూలుగా ఉండేవి. పంట భూములు మాత్రమే కనిపించేవి. ప్రస్తుతం నిత్యం భక్తుల రద్దీతో ఈ ఏరియా ఎంతో సందడిగా మారింది. పరిసర భూముల్లో దుకాణాలు, రియల్‌ ఎస్టేట్‌ వెంచర్లు, ఫంక్షన్‌ హాళ్లు, వైన్స్‌లు, పెట్రోల్‌ బంకులు వెలిసి వ్యాపార కేంద్రంగా విస్తరిస్తుంది. భూముల ధరలు కూడా రూ.కోట్లలో పలుకుతున్నాయి. భక్తులు కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా పేరొందిన కోటమైసమ్మ ఆలయం ఉండటంతో పరిసరాలు బాగా అభివృద్ధి చెందాయి.



ఇండ్ల కోటయ్యగూడెం సమీపంలోని కోటమైసమ్మ ఆలయం

వారంలో మూడు రోజులు జాతర

గతంలో అమ్మవారిని వారంలో ప్రతీ ఆది, మంగళ, గురువారాల్లో మా త్రమే దర్శించుకునేవారు. ఆ మూడు రోజులు జాతరను తలపించేది. కానీ ప్రస్తుతం నిత్యం అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు అధిక సంఖ్యలో వస్తున్నారు. భక్తుల కొంగుబంగారంగా అమ్మవారు విరాజిల్లుతుండటంతో అమ్మవారిని దర్శించుకునేందుకు ఉమ్మడి నల్లగొండ జిల్లానుంచే కాకుండా రంగారెడ్డి, హైదరాబాద్‌, ఏపీలోని గుంటూరు, ప్రకాశం తదితర జిల్లాల నుంచి భక్తులు హాజరై, తమ మొక్కులు చెల్లించుకుంటున్నారు.

వ్యాపార కేంద్రంగా కోటమైసమ్మ

రోజురోజుకు కోటమైసమ్మ ఏరియా వ్యాపార కేంద్రంగా విస్తరిస్తోంది. దేవస్థానం కేంద్రంగా ఫంక్షన్‌ హాళ్లు, హోటళ్లు, చికెన్‌ సెంటర్లు, పెట్రోలు బంకులు, వైన్స్‌ దుకాణాలు, పెట్రోలు బంకులు, ఆట వస్తువులు, బొమ్మల దుకాణాలతో సందడిగా మారింది. చికెన్‌, మద్యం వ్యాపారాలకు కొదవ లేదు.

ఎకరం భూమి ధర రూ.నాలుగు కోట్లు

కోటమైసమ్మ ఏరియాలో భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. 20ఏళ్ల క్రితం ఇక్కడ రూ.మూడు లక్షలు పెడితే ఎకరం భూమి దొరికేది. ప్రస్తుతం ఎకరం ధర రూ.మూడు కోట్ల నుంచి రూ.నాలుగు కోట్లు పలుకుతుంది. కోటమైసమ్మ శివారులోనే ఎకరం రూ.రెండు కోట్లు చెబుతున్నారు. ఇక్కడ ఒక మడిగ స్థలం కొనాలన్నా రూ.15లక్షలు పెట్టాల్సిందే. ధరలు పెరిగినప్పటికీ ఈ ప్రాంతంలో వెంచర్లు ఏర్పడుతున్నాయి.

మద్యం దుకాణాలకు డిమాండ్‌

కోటమైసమ్మ ఏరియాలో వైన్స్‌ దుకాణాలకు ఎంతో డిమాండ్‌ ఉంటుంది. అమ్మవారి ఉత్సవాలు జరిగే రోజుల్లో మద్యం అమ్మకాలు విపరీతంగా జరుగుతాయి. అదేవిధంగా నిత్యం ఇక్కడ ఫంక్షన్లు జరుగుతున్నందున మద్యం దుకాణాలు కిటికిటలాడుతుంటాయి. ఐదారు మండలాలకు కోటమైసమ్మ ఏరియా జంక్షన్‌ కావడంతో రూ.కోటి గుడ్‌విల్‌ ఇచ్చి ఇక్కడ మద్యం దుకాణం తీసుకునేందుకు అనేక మంది ముందుకు వస్తుంటారు. మామూలు రోజుల్లో ఒక దుకాణంలో రూ.లక్షన్నర నుంచి రూ.రెండు లక్షల వరకు మద్యం అమ్మకాలు జరుగుతాయి. అమ్మవారి ఉత్సవాలు, శుభకార్యాలు జరిగే రోజుల్లో రూ.4 లక్షల నుంచి రూఐదు లక్షల వరకు అమ్మకాలు నడుస్తాయి. నిత్యం వాహనాల రద్దీ ఉంటున్నందున ఇక్కడ రెండు పెట్రోలు బంకులు కూడా ఏర్పాటయ్యాయి.

సింగిల్‌ రోడ్డుతో ఇబ్బందులు

కోటమైసమ్మ ఆలయ ప్రాంతం రోజురోజుకూ అభివృద్ధి చెందుతున్నప్పటికీ సింగిల్‌ రోడ్డు కారణంగా వాహనదారులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నిడమనూరుతోపాటు త్రిపురారం, హాలియా, తిరుమలగిరి(సాగర్‌), దామరచర్ల, అడవిదేవులపల్లి మండలాల్లోని వివిధ గ్రామాలకు ఈ రహదారి మీదుగానే ప్రయాణం చేస్తుంటారు. దీంతో నిత్యం ఈ ఏరియా భక్తులు, వాహనదారులతో ఎంతో రద్దీగా ఉంటుంది. ఆది, మంగళ, గురువారాల్లో భక్తులు అధిక సంఖ్యలో అమ్మవారిని దర్శించుకునేందుకు హాజరవుతారు. అదే విధంగా శుభకార్యాలు ఉన్న రోజుల్లో వాహనదారులు ఎక్కువ మంది వస్తుంటారు. కానీ సింగిల్‌ రోడ్డు కారణంగా తరచూ ట్రాఫిక్‌ సమస్య ఏర్పడుతుంది.

శుభకార్యాలన్నీ దేవాలయం వద్దే

చుట్టు పక్కల ప్రాంతాలకు చెందిన ప్రజలు అన్ని శుభకార్యాలు ఇక్కడే నిర్వహించుకుంటున్నారు. గెట్‌ టు గెదర్‌, పుట్టినరోజు వేడుకలు, శారీఫంక్షన్‌ వంటి చిన్న వేడుకల నుంచి వివాహాల వరకు అన్ని వేడుకలు ఇక్కడే జరుపుకుంటున్నారు. వేడుకలు నిర్వహించేందుకు ఫంక్షన్‌హాళ్లు బడ్జెట్‌ పరంగా అనుకూలంగా ఉండటంతో ఇక్కడే శుభకార్యాలు చేసేందుకు మక్కువ చూపుతున్నారు. గతంలో ఇక్కడ ఐదు చిన్న ఫంక్షన్‌ హాళ్లు మాత్రమే ఉండేవి. కానీ ఈ ఏరియాలో ప్రస్తుతం సుమారు 40 వరకు ఫంక్షన్‌ హాళ్లు ఉన్నాయి.

ఫంక్షన్‌ హాళ్లు పెరిగాయి



కోటమైసమ్మ ఏరియాలో నిత్యం శుభకార్యాలు నిర్వహించేందుకు ప్రజలు ఆసక్తి చూపుతుండటంతో ఫంక్షన్‌ హాళ్ల సంఖ్య రోజురోజుకు పెరుగుతుంది. ఫంక్షన్‌ హాళ్లు నిర్మించేందుకు పలువురు ముందుకొస్తున్నారు. ఫంక్షన్‌ హాళ్లు కూడా అందుబాటు ధరలకు లభిస్తున్నందున అనేక మంది ఇక్కడే వేడుకలు జరుపుకునేందుకు ఇష్టపడుతున్నారు. పట్టణాలకు దీటుగా అన్ని రకాల శుభకార్యాలు చేసేందుకు ఇక్కడి ఫంక్షన్‌ హాళ్లలో సౌకర్యాలు ఉన్నాయి.

రాంబాబు, మిర్యాలగూడ

పలువురికి ఉపాధి దొరుకుతోంది



కోటమైసమ్మ ఏరియా రోజురోజుకు అన్ని విధాలుగా అభివృద్ధి చెందుతుంది. వ్యాపార కేంద్రంగా విస్తరిస్తుంది. వ్యాపారాలకు నిలయంగా మారడంతో ఇక్కడ అనేక మందికి నిత్యం ఏదో ఒక పని దొరుకుతుంది. ఇక్కడ ఫంక్షన్‌ హాళ్లలో ప్రతీరోజు శుభకార్యాలు జరుగుతండటంతో డెకరేషన్‌ పనులతో ఉపాధి పొందుతున్నాను.

పేర్ల కుమార్‌, తుమ్మడం.

అభివృద్ధి పథంలో దూసుకెళ్తోంది



కోటమైసమ్మ ఏరియా దినదినాభివృద్ధి చెందుతుంది. వ్యాపారకేంద్రంగా విస్తరిస్తుండటంతో భూముల ధరలు విపరీతంగా పెరిగాయి. భూములు కొనేందుకు అనేక మంది ఆసక్తి చూపుతున్నారు. ఫంక్షన్‌హాళ్లు, పలు వ్యాపారాలు ఉన్నందున ఇక్కడ అనేక మంది ఇక్కడ ఉపాధి పొందుతున్నారు. అమ్మవారి దేవస్థానం ఉన్నందున ఈ ఏరియా అభివృద్ధిలో దూసుకెళ్తుంది.

మార్తి సురేందర్‌రెడ్డి, మార్తివారిగూడెం

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక





మఠంపల్లిలో విద్యార్థిని అభినందిస్తున్న ఉపాధ్యాయులు

మఠంపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా మఠంపల్లి మండలకేంద్రంలోని జడ్పీహెచ్‌ఎస్‌ ఉన్నత పాఠశాలలో తొమ్మిదో తరగతి చదువుతున్న జానపాటి గణేష్‌ రాష్ట్రస్థాయి వాలీబాల్‌ పోటీలకు ఎంపికైనట్లు హెచ్‌ఎం మౌలాన తెలిపారు. శుక్రవారం విద్యార్థిని అభినందించి సన్మానించారు. జిల్లా కేంద్రంలో జరిగిన జిల్లాస్థాయి పోటీలలో ప్రతిభ కనపరచి రాష్ట్రస్థాయి వాలీబాల్‌ పోటీలకు ఎంపికయ్యారని తెలిపారు. గణేష్‌ను అభినందించిన వారిలో ఉపాధ్యాయులు, తదితరులు ఉన్నారు.

మేళ్లచెర్వు: ఈ నెల 29 నుంచి డిసెంబరు 2వ తేదీ వరకు రాజన్న సిరిసిల్ల జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి జూనియర్‌ వాలీబాల్‌ పోటీలకు మండలకేంద్రంలో జిల్లా పరిషత్‌ హైస్కూల్‌లో పదో తరగతి చదువుతున్న చిన్నపంగు శృతి ఎంపికకావడంతో మండల విద్యాధికారి వెంకటరెడ్డి శృతిని అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు నరపరెడ్డి, సత్యనారాయణ ప్రసాద్‌, శ్రీమన్నారాయణ, శాంతి, నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

జిల్లా స్థాయి అథ్లెటిక్స్‌లో ద్వితీయస్థానం

శాలిగౌరారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): నల్లగొండలోని మేకల అభినవ్‌ స్టేడియంలో నిర్వహించిన పీఎంశ్రీ జిల్లాస్థాయి క్రీడోత్సవాల్లో అథ్లెటిక్స్‌ విభాగంలో శాలిగౌరారం మండలం వల్లాల మోడల్‌ స్కూల్‌కు చెందిన షేక్‌ నస్రీన్‌ 100మీటర్లలో ద్వితీయ స్థానం సాధించిందని ప్రిన్సిపాల్‌ కృష్ణమోహన్‌ ఒక ప్రకటనలో తెలిపారు. బహుమతి సాధించిన నస్రీన్‌ను పీడీ బొడ్డు మల్లేష్‌ను ఉపాధ్యాయుల బృందం అభినందించారు.

ఉమ్మడి జిల్లాస్థాయి ఖోఖో జట్ల ఎంపిక పోటీలు

నల్లగొండ స్పోర్ట్స్‌, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్‌ గ్రేమ్స్‌ ఫెడరేషన్‌ అండర్‌-19 ఆధ్వర్యంలో డిసెంబరు ఒకటో తేదీన ఉమ్మడి నల్లగొండ జిల్లా ఏజీఎఫ్‌-19 ఖోఖో బాలబాలికల జట్ల ఎంపిక పోటీలు కనగల్‌ మండలకేంద్రంలోని జడ్పీహైస్కూల్లో నిర్వహిస్తున్నట్లు అండర్‌-19 జిల్లా కార్యదర్శి కుంభం నర్సిరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. సూర్యాపేట, యాదాద్రి భువనగిరి, నల్లగొండ జిల్లాలకు చెందిన క్రీడాకారులు బోనాఫైడ్‌ సర్టిఫికేట్‌, టెన్త్‌ మెమోతో హాజరు కావాలని కోరారు. ఇతర వివరాలకు సెల్‌:9949337099ను సంప్రదించాలన్నారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ జట్టుకు ఎంపిక

ఆలేరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): యాదాద్రి భువనగిరి జిల్లా ఆలేరు జిల్లా పరిషత్‌ బాలికల ఉన్నత పాఠశాలకు చెందిన నలుగురు బాలికలు కబడ్డీ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారు. ఈ నెల 26న యాదగిరిగుట్ట మండలం మాసాయిపేటలో కబడ్డీ అసోసియేషన్‌ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన కబడ్డీ బాలికలు జిల్లాస్థాయి సీనియర్‌ జూనియర్‌ పోటీలలో పాఠశాలకు చెందిన తొమ్మిదో తరగతి విద్యార్థినులు కె.భార్గవి, పి.రేచల్‌, కె.అక్షిత, ప్రతిభ పాల్గొని తమ ఆటతీరుతో రాష్ట్ర జట్టుకు ఎంపికయ్యారు. డిసెంబర్‌లో నల్లగొండ, కరీంనగర్‌ జిల్లాలో జరిగే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారు. వీరి ఎంపికపట్ల పాఠశాల హెడ్‌మాస్టర్‌ దాసరి మంజుల, ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్‌ రావుల సత్యనారాయణరెడ్డి, పలువురు ఉపాధ్యాయులు సంతోషం వ్యక్తంచేస్తూ బాలికలకు అభినందనలు తెలిపారు.

వైభవంగా సువర్ణ పుష్పార్చన, ఊంజల్‌ సేవ



ఊంజల్‌ సేవోత్సవం నిర్వహిస్తున్న అర్చకులు

యాదగిరిగుట్ట, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీ నరసింహ స్వామివారి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి సువర్ణ పుష్పార్చన, అమ్మవారికి ఊంజల్‌ సేవోత్సవం వైభవంగా జరిపారు. ఆగమ శాస్త్ర రీతిలో వేడుకలు నిర్వహించిన అర్చకులు వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించగా హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ప్రధానాలయంలో కొలువుదీరిన ఆండాళ్‌ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అర్చకులు అద్దాల మండపం ఊయలలో అధిష్ఠింపజేశారు. అర్చకుల వేదమంత్ర పఠనాలు, ఆస్థాన విద్వాంసుల మంగళవాయిద్యాలు, మహిళా భక్తుల మంగళ నీరాజనాల మధ్య ఊంజల్‌ సేవోత్సవం నేత్రపర్వంగా సాగింది. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయరీతిలో కొనసాగాయి. శివాలయంలో రామలింగేశ్వరస్వామికి నిత్య పూజలు, చండీహోమం శైవాగవ పద్ధతిలో చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ.18,75,314 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో ఎస్‌.వెంకట్రావు తెలిపారు.

అన్నదాన సత్రంలో స్థానికులకే ప్రాధాన్యం ఇవ్వాలి

నూతనంగా ప్రారంభించనున్న అన్నదాన సత్రంలో జీవనోపాధికోసం స్థానికులకు ప్రాధాన్యమిచ్చి అవకాశం కల్పించాలని యాదగిరిపల్లి వాసులు డిమాండ్‌ చేశారు. కొండపై శుక్రవారం అనువంశిక ధర్మకర్త భాస్కరాయణీ నరసింహమూర్తిని కలిసి వినతి పత్రం అందజేసి యువకులు మాట్లాడుతూ గత ప్రభుత్వం ఆలయ పునర్నిర్మాణంలో భాగంగా గ్రామస్థులు నుంచి వందల ఎకరాల వ్యవసాయ భూములు సేకరించి ఎలాంటి ఉపాధి అవకాశాలు చూపలేదన్నారు. భూ నిర్వాసితులు, గ్రామంలో నిరుద్యోగులు అధికంగా ఉండటంతో 80శాతం మేర ఉపాధి పొందేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలన్నారు. వినతిపత్రం అందజేసినవారిలో యముడాల బాలరాజు, నక్కల బాలనర్సింహ, నీస భాస్కర్‌, బూడిద నాగరాజు, వల్లాల రమేష్‌, బుగ్గ శ్రీకాంత్‌ పాల్గొన్నారు.

కమనీయం.. మట్టపల్లివాసుడి కల్యాణం

మఠంపల్లి, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మట్టపల్లి లక్ష్మీ నృసింహుని క్షేత్రంలో శుక్రవారం రాజలక్ష్మీ, చెంచులక్ష్మీ సమేత లక్ష్మీ నరసింహుని నిత్యకల్యాణం కమనీయంగా సాగింది. భక్తవత్సలునికి నిజాభిషేకం, నిత్యార్చనలు చేశారు. మధ్యాహ్నం అమ్మవారికి కుంకుమార్చన, విశేషపర్వాలు నిర్వహించారు. వేద పండితులు తూమాటి రామాచార్యులు, కుమ్మరికుంట్ల బదరీనారాయణచార్యులు, లక్ష్మీనరసింహమూర్తితో శాస్త్రోక్తంగా కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్‌ చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్‌, ఈవో అజ్మీర జ్యోతి, ఆలయ ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బుద్ధవనంలో విదేశీయుల సందడి



బుద్ధవనం బ్రోచర్‌ను అందజేస్తున్న ఈవో

నాగార్జునసాగర్‌, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ బౌద్ధక్షేత్రమైన నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌ హిల్‌ కాలనీ బుద్ధవనంలో శుక్రవారం విదేశీయుల సందడి నెలకొంది. నాగార్జునసాగర్‌ సందర్శనలో భాగంగా స్విట్జర్లాండ్‌, ఆస్ట్రేలియా, ఫ్రాన్స్‌, థాయ్‌లాండ్‌ దేశాలకు చెందిన విదేశీ బౌద్ధుల బృందం బుద్ధవనాన్ని సందర్శించింది. బుద్ధవనం సందర్శనలో భాగంగా అక్కడ చరితవనం, ధ్యాన వనం, జాతక వనం, స్తూపవనం, మహాస్తూపాలను తిలకించారు. మహాస్తూపం లోపల ఆచార్య నాగార్జునుడి విగ్రహం చుట్టూ ప్రదక్షిణాలు చేశారు. అనంతరం బుద్ధజ్యోతిని వెలిగించారు. థాయ్‌లాండ్‌ దేశానికి చెందిన థాయ్‌ బోధ్‌ గయా బౌద్ధ విహారంనుంచి బౌద్ధ మత గురువులు మహాస్తూపం లోపల ధ్యాన మందిరంలో ధ్యానం చేశారు. వారికి బుద్ధవనం బ్రోచర్‌లను ఈవో శాసన, మేనేజర్‌ రవిచంద్ర అందజేశారు.

అన్నదాన సత్రానికి సర్వం సిద్ధం



సత్ర భవనంలో బెంచీలు, కుర్చీలు ఏర్పాట్లు చేసిన అధికారులు

యాదగిరిగుట్ట, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామివారి అన్నదాన సత్ర భవనం ఎట్టకేలకు సర్వం సిద్ధంచేశారు. ఈమేరకు ఆదివారం కొండ కింద ఆధ్యాత్మిక వాడలో అధికారులు ఆదివారం ముహూర్తం ఖరారు చేసిన నేపథ్యంలో స్వామివారి నిత్యాన్నదాన సత్రం భవనం ఎట్టకేలకు ప్రారంభించనున్నారు. ఆలయ పునరుద్ధాటన జరిగి నేటికి (2022 మార్చి 28 నుంచి 2025 నవంబరు 28 వరకు) మూడేళ్ల ఎనిమిది నెలలు దాటినప్పటికి భక్తులు నేలపైనే అరకొర సౌకర్యాల నడుమ అన్నప్రసాదం స్వీకరిస్తున్నారు. భక్తుల ఇబ్బందులపై అనువంశిక ధర్మకర్త, భాస్కరాయణి నరసింహమూర్తి, ఈవో ఎస్‌.వెంకట్రావు నూతన భవనం అందుబాటులోకి తెచ్చేందుకు సన్నాహాలు మొదలుపెట్టారు.

రేపే ప్రారంభం

ఆధ్యాత్మిక వాడలో సుమారు రూ.23కోట్లు వెచ్చించి నిర్మించారు. వైటీడీఏ, దేవస్థానం, రూ.14కోట్లు వెచ్చించిన ఆంధ్రప్రదేశ్‌ పశ్చిమగోదావరి జిల్లా గణపవరం దాత వేగేశ్న అనంత కోటీ రాజుతో కలిసి నిర్మించిన భవనం దాతచేతుల మీదుగా ప్రారంభించనున్నారు. హరేరామ.. హరే కృష్ణ ఇస్కాన్‌ వంటి ఆధ్యాత్మిక సంస్థలు సంయుక్తంగా గండిచెరువు సమీపంలో వైటీడీఏ ఆధ్వర్యంలో డిజైన్‌ రూపొందించారు. నూతన అన్నదాన సత్ర భవనంలో రెండు డైనింగ్‌, రెండు వెయిటింగ్‌ హాళ్లు, 12 స్టోర్‌ గదులు, కేటాయించిన భూమిలో 25శాతం వంటల గది నిర్మించారు. తొలుత 200మందితో ప్రారంభించిన పథకం 500 మందికి చేరింది. స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలకు వెయ్యినుంచి 1,500 మంది భక్తులకు భోజన సదుపాయం కల్పించారు. రోజుకు 2వేల నుంచి 5వేల మంది భక్తులకు భోజన వసతి సౌకర్యం ఉంది.

చెర్వుగట్టు హుండీల ఆదాయం రూ.42.87లక్షలు

నార్కట్‌పల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా చెర్వుగట్టు మండలంలోని చెర్వుగట్టు పార్వతీ జడల రామలింగేశ్వరస్వామి దేవస్థానంలో 49 రోజుల హుండీ ఆదాయాన్ని శుక్రవారం లెక్కించారు. భక్తులు కానుకల రూపంలో సమర్పించిన నగదు మొత్తం రూ.42,87,544 లభించింది. గుట్టపైన ప్రధానాలయం, ఉపాలయాల వద్ద ఉన్న హుండీలను తెరిచి లెక్కించగా రూ.38,49,876, గుట్ట కింద పార్వతీ అమ్మవారి ఆలయ హుండీల నుంచి రూ.4,37,668 మొత్తం కలిపి రూ.42,87,544 లభించినట్లు ఈవో మోహన్‌బాబు తెలిపారు. అదేవిధంగా నిత్యాన్నదానంకోసం భక్తులు సమర్పించిన విరాళాలు మొత్తం రూ.42,374లతో పాటు అమెరికా డాలర్లు-39, కెనడా డాలర్లు 5, శ్రీలంక రూపాయలు 10 హుండీలో భక్తులు సమర్పించారని తెలిపారు. కార్యక్రమంలో ఎండోమెంట్‌ పరిశీలకురాలు బి.సుమతి, శ్రీదుర్గశివసాయి సేవాసంఘం సభ్యులు, భక్తులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి అవార్డులు సొంతం



రవిశేఖర్‌

సూర్యాపేటఅర్బన్‌, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): సూర్యాపేట జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ సైంటిస్టు డాక్టర్‌ అనంతుల రవిశేఖర్‌ జాతీయ ఇండియా ఫార్మా అవార్డును శుక్రవారం ఢిల్లీలో అందుకున్నారు. ఆయన రంగంలో చేసిన సేవలకు 2025-ఫార్మా క్వాలిటీ ఎక్సలెన్స్‌ అవార్డును సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా డాక్టర్‌ రవిశేఖర్‌ మాట్లాడుతూ ఈ అవార్డుతో బాధ్యత మరింతగా పెరిగిందన్నారు.

మునగాల రూరల్‌: మండలంలోని బరాకత్‌గూడెం గ్రామానికి చెందిన యశోద ఫౌండేషన్‌ చైర్మన్‌, బీసీ సేన జాతీయ కార్యదర్శి డాక్టర్‌ నరాల రుక్మారావు డాక్టర్‌ ఏపీజే అబ్దుల్‌ కలాం నేషనల్‌ అవార్డు అందుకున్నట్లు తెలిపారు. కీర్తి ఆర్ట్స్‌ అకాడమీ ప్రెసిడెంట్‌ బిందు లిమా ఆధ్వర్యంలో శుక్రవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతి ఆడిటోరియంలో నిర్వహించిన కార్యక్రమంలో తనకు అవార్డును ప్రదానం చేసి సత్కరించినట్లు తెలిపారు.

ఆదాయంలో ముందు వరుసలో నిలపాలి

● ఆర్టీసీ హైదరాబాద్‌ జోన్‌ ఈడీ ఖుస్రో షాఖాన్‌



దేవరకొండ బస్టాండ్‌ను తనిఖీ చేస్తున్న ఖుస్రో షాఖాన్‌


దేవరకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దేవరకొండ డిపోను ఆదాయంలో రాష్ట్రంలోనే మొదటిస్థానంలో నిలపాలని ఆర్టీసీ హైదరాబాద్‌ జోన్‌ ఎగ్జిక్యూటివ్‌ డైరెక్టర్‌ ఖుస్రో షాఖాన్‌ అన్నారు. శుక్రవారం దేవరకొండ ఆర్టీసీ డిపో, బస్టాండ్‌ను జిల్లా ఆర్‌ఎం జాన్‌రెడ్డితో కలిసి తనిఖీచేసి మాట్లాడారు. తెలంగాణలో ఆర్టీసీ ప్రయాణికులకు ఉత్తమ సేవలు అందిస్తుందని తెలిపారు. ప్రయాణికులను గౌరవించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేర్చాల్సిన బాధ్యత ఆర్టీసీ ఉద్యోగులపై ఉందన్నారు. సమష్టి కృషితో ఉద్యోగులు డిపో ఆదాయాన్ని పెంచాలన్నారు. డిపోలో పరిసరాలను శుభ్రంగా ఉంచాలన్నారు. కార్మికుల సంక్షేమం కోసం ఆర్టీసీ సంస్థ కృషి చేస్తుందన్నారు. ఆయనవెంట దేవరకొండ డిపో ఇన్‌చార్జి మేనేజర్‌ పడాల సైదులు, ఆర్టీసీ ఉద్యోగులు ఉన్నారు.

లాంచీలో వెళ్లొద్దాం రండి!

● నేటి నుంచి సాగర్‌-శ్రీశైలం లాంచీ ప్రయాణం ప్రారంభం
● 110 కిలోమీటర్లు.. 6 గంటల ప్రయాణం



ఆబ్బురపరిచే కృష్ణమ్మ తీరప్రాంత అందాలు



చుట్టూ దట్టమైన నల్లమల అడవులు.. ఎత్తయిన కొండలు, కోనలు.. పక్షుల కిలకిలరావాలు.. వన్యప్రాణుల వయ్యారాలు.. కృష్ణమ్మ సవ్వడులు.. 110 కిలోమీటర్ల ప్రయాణం.. ఆరు గంటల సమయం.. అలా లాంచీలో లాహిరి లాహిరి.. లాహిరీలో అంటూ వెళుతుంటే ఆ మధురానుభూతే వేరు. నాగార్జునసాగర్‌ నుంచి శ్రీశైలం వరకు లాంచీ ప్రయాణం నేటి నుంచి ప్రారంభం కానుంది.
(ఆంధ్రజ్యోతి-నాగార్జునసాగర్‌)

నల్లగొండ జిల్లా నాగార్జునసాగర్‌ హిల్‌కాలనీ నుంచి ఏపీలోని నంద్యాల జిల్లా శ్రీశైలం వరకు నీటిపై లాంచీలో ప్రయాణం చేయడానికి లాంచీలను నేటి నుంచి నడపడానికి పర్యాటక ఏర్పాట్లు చేసింది. నాగార్జునసాగర్‌ జలాశయంలో 550 అడుగులకుపైగా నీరు ఉన్నప్పుడు మాత్రమే లాంచీలు నడుస్తాయి. ఈ ఏడాది ఆగస్టు నెలలోనే సాగర్‌ నీటిమట్టం 550 అడుగులు దాటింది. దీంతో రేపటినుంచి సాగర్‌-శ్రీశైలం లాంచీలను నడపడానికి పర్యాటక శాఖ వారు ఏర్పాట్లు చేస్తున్నారు. ఆరు గంటలపాటు ఆహ్లాదకరంగా సాగే ఈ ప్రయాణం ఒక్కసారిగా లింగాలగట్టు ఘాట్‌ వద్దకు చేరుకోగానే ఆధ్యాత్మికంగా ప్రతీఒక్కరు పరవశానికి లోనవుతారు. శివనామ స్మరణతో రాత్రికే అక్కడ బసచేసి మరుసటి రోజు తెల్లవారుజామున మల్లిఖార్జునస్వామిని దర్శించుకుంటారు. లాంచీలు ఓ వైపు నాగార్జునకొండ, మరోవైపు చాకలిగట్టు నడుమ నుంచి ఏలేశ్వరం గట్టును దాటుకొని వెళుతుంది. మార్గమధ్యంలో పెండోట, ఎర్రమిట్ట, పావురాలగుట్ట, ఇనుపరాయి కొండ, జర్రివాగులు కనువిందు చేస్తాయి. సోమవారం నుంచి శుక్రవారం వరకు 100 టికెట్లు ఎవరైన బుక్‌ చేసుకుంటే సాగర్‌ నుంచి శ్రీశైలానికి లాంచీ నడుపుతామని అధికారులు పేర్కొన్నారు. పూర్తి వివరాలకు పర్యాటక శాఖ కార్యాలయం హైదరాబాద్‌ ఇన్ఫర్మేషన్‌ కౌంటర్‌ సెల్‌:9848540371 లేదా సాగర్‌ లాంచీ స్టేషన్‌ సెల్‌:7997951023లను సంప్రదించవచ్చన్నారు. డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీజీటీడీటీ.ఇన్‌ వెబ్‌సైట్‌లో కూడా టికెట్లను బుక్‌ చేసుకొవచ్చునని పర్యాటక శాఖ వివరించారు. సాగర్‌-శ్రీశైలం లాంచీ శనివారం ఉదయం 10గంటలకు సాగర్‌ హిల్‌కాలనీ నుంచి బయలుదేరి సాయంత్రం 4 గంటలకు శ్రీశైలం చేరుకుంటుందని, అలాగే మరుసటి రోజు ఆదివారం శ్రీశైలం నుంచి ఉదయం 10 గంటలకు లాంచీ బయలు దేరి సాయంత్రం 4గంటలకు సాగర్‌ చేరుకుంటుందని అధికారులు తెలిపారు.



కొనసాగుతున్న నామినేషన్లు

కేతేపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కేతేపల్లి మండలంలోని వివిధ గ్రామాల్లో గురువారం రెండో రోజు సర్పంచ్, వార్డు సభ్యుల పదవులకు అభ్యర్థులు ముమ్మరంగా నామినేషన్లు వేశారు. మండలంలోని 16గ్రామాల్లో తొలి విడతలో నిర్వహించే పంచాయతీ ఎన్నికల నామినేషన్ల స్వీకరణకు మండల కేంద్రం కేతేపల్లి, కొత్తపేట, తుంగతుర్తి, ఇనుపాముల, చెరుకుపల్లి గ్రామాల్లో నామినేషన్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఆయా కేంద్రాల్లో తొలిరోజు గురువారం నామమాత్రంగా నామినేషన్లు దాఖలు కాగా వివిధ పార్టీలకు చెందిన నాయకులు సర్పంచ్, వార్డు పదవులకు శుక్రవారం అధిక సంఖ్యలో నామినేషన్లు వేశారు. మండలంలోని 16 గ్రామాల సర్పంచ్ పదవులకు శుక్రవారం 19 మంది నామినేషన్లు వేశారు. అలాగే 160వార్డు సభ్యుల పదవులకు 61 మంది నామినేషన్లు వేశారు. కేతేపల్లి



కేతేపల్లిలో సర్పంచ్ పదవికి నామినేషన్ వేస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి

క్లస్టర్‌లో సర్పంచ్ పదవులకు 5 నామినేషన్లు, వార్డు పదవులకు 24 నామినేషన్లు, చెరుకుపల్లి క్లస్టర్‌లో సర్పంచ్ పదవులకు 5, వార్డు సభ్యుల పదవులకు 5, కొత్తపేట క్లస్టర్‌లో సర్పంచ్ పదవులకు 5, వార్డు సభ్యులకు 15, తుంగతుర్తి క్లస్టర్‌లో సర్పంచ్ పదవులకు 1, వార్డు సభ్యుల పదవులకు 4, ఇనుపాముల క్లస్టర్‌లో సర్పంచ్ పదవులకు 3, వార్డు సభ్యుల పదవులకు 13నామినేషన్లు చొప్పున మొత్తం సర్పంచ్ పదవులకు 19, వార్డు సభ్యుల పదవులకు 24 నామినేషన్లు దాఖలయ్యాయి. నామినేషన్ల దాఖలుకు రాజకీయ పార్టీల అభ్యర్థులు అధిక సంఖ్యలో మద్దతుదారులతో తరలిరావడంతో ఆయా క్లస్టర్ కేంద్రాల్లో జన సందడి నెలకొంది. ఇదిలా ఉంటే బీసీ జనరల్‌గా ఉన్న ఉప్పలపహాడ్ గ్రామ సర్పంచ్ పదవికిగాని, ఆ గ్రామంలోని 8వార్డులకు గాని రెండు రోజుల్లో ఒక్కరూ కూడా నామినేషన్ దాఖలు చేయలేదు. నామినేషన్ల స్వీకరణను మండల పర్యవేక్షణాధికారి ఎంపీడీవో బి.శ్రీనివాసరావు, ఎంపీవో నాగలక్ష్మి పర్యవేక్షించారు.

శాలిగౌరారం: శాలిగౌరారం మండలంలో సర్పంచ్ పదవులకు రెండో శుక్రవారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని నామినేషన్లు దాఖలు చేశారు. 24 గ్రామపంచాయతీలకు గాను 34మంది సర్పంచ్ పదవులకు, 320 వార్డు పదవులకు గాను 66 నామినేషన్లు దాఖలు చేసినట్లు ఎంపీడీవో జ్యోతిలక్ష్మి తెలిపారు. రెండు రోజులు కలిపి సర్పంచులకు 72, వార్డులకు 79నామినేషన్లు దాఖలైనట్లు ఆమె తెలిపారు.

కట్టంగూరు: కట్టంగూరు మండలంలో సర్పంచ్ పదవులకు రెండోరోజూ శుక్రవారం వివిధ పార్టీలకు చెందిన నాయకులు పాల్గొని నామినేషన్లు దాఖలు చేశారు. 29 మంది సర్పంచ్ పదవులకు, వార్డు సభ్యులకు 38నామినేషన్లు దాఖలు చేసినట్లు కట్టంగూరు ఎంపీడీవో జ్ఞానప్రకాశ్‌రావు తెలిపారు.

కనగల్: గ్రామ పంచాయతీ ఎన్నికల్లో భాగంగా శుక్రవారం రెండోరోజు నామినేషన్ల ప్రక్రియ సజావుగా కొనసాగింది. 31 జీపీలకు గాను 29, 262 వార్డు స్థానాలకు గాను 31 నామినేషన్లను అభ్యర్థులు సమర్పించారని ఎంపీడీవో వేదరక్షిత తెలిపారు. శనివారంతో నామినేషన్ల ప్రక్రియ ముగుస్తుందన్నారు.

చండూరు రూరల్: చండూరు మండలంలో శుక్రవారం నామినేషన్ల పర్వం మందకొడిగా సాగింది. చండూరు మండలంలో 19 గ్రామ పంచాయతీలకు గాను 6 క్లస్టర్లలో మొత్తం సర్పంచులకు 21 నామినేషన్లు, వార్డు సభ్యులకు 40 నామినేషన్లు వేశారు. సర్పంచులకు రెండు రోజులకు కలిపి 46 నామినేషన్లు, వార్డుసభ్యులకు 59 నామినేషన్లు దాఖలయ్యాయి. ఈ సందర్భంగా ఆయా క్లస్టర్లను చండూరు ఆర్డీవో శ్రీదేవి, ఎంపీడీవో యాదగిరి పరిశీలించారు.

గట్టుప్పల: గట్టుప్పల మండలంలో 3 క్లస్టర్లు 7 గ్రామపంచాయతీలకు గాను సర్పంచ్ అభ్యర్థులు 9 నామినేషన్లు, వార్డు సభ్యులకు 25 నామినేషన్లు దాఖలయ్యాయి.

నాంపల్లి: నాంపల్లి మండలంలో పలు గ్రామాలకు సంబంధించి శుక్రవారం 39 మంది సర్పంచ్ అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారు. 65 మంది వార్డు సభ్యుల అభ్యర్థులు నామినేషన్లు దాఖలు చేశారని ఎంపీడీవో రామకృష్ణశర్మ తెలిపారు. ఈ నెల 27, 28 తేదీల్లో మొత్తం 66 సర్పంచ్ అభ్యర్థులు, 81 మంది వార్డు అభ్యర్థులు నామినేషన్లు వేశారు.



చిట్యాల: నేరడ సర్పంచ్ అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేస్తున్న అరుణ్

చిట్యాలరూరల్: మండలంలోని నేరడ గ్రామానికి చెందిన యువకుడు వీరమళ్ల అరుణ్‌కుమార్ గ్రామ సర్పంచ్‌గా పోటీ చేసేందుకు స్వతంత్ర అభ్యర్థిగా తన నామినేషన్‌ను దాఖలు చేశారు. వట్టిమర్తి క్లస్టర్‌లో నామినేషన్ కేంద్రంలో నేరడ సర్పంచ్ అభ్యర్థిగా అరుణ్‌కుమార్ ఆర్వోకు అందజేశారు. యువకుడు నామినేషన్‌ను దాఖలు చేసేందుకు వెళ్తున్నాడని తెలిసి పలువురు గ్రామస్థులు అతడికి మద్దతుగా నామినేషన్ కేంద్రానికి తోడుగా వెళ్లారు. రుణ్‌కుమార్ నామినేషన్ వేశాడని తెలుసుకున్న గ్రామస్థులు యువకుడిని అభినందిస్తున్నారు.

చిట్యాల మండలంలో రెండో రోజు నామినేషన్ పర్వం కొనసాగింది. మండలంలోని 18 గ్రామాలకు 6 క్లస్టర్లలో 21 సర్పంచ్, 56 వార్డు సభ్యులకు నామినేషన్లు దాఖలయ్యాయి.

నకిరేకల్: నకిరేకల్ మండలంలోని 17 గ్రామ పంచాయతీలలో 5 కేంద్రాల్లో రెండోరోజు శుక్రవారం గ్రామ పంచాయతీ సర్పంచ్ కోసం 11, వార్డు సభ్యుల కోసం 33 మంది అభ్యర్థులు నామినేషన్లు వేసినట్లు ఎంపీడీవో వెంకటేశ్వర్‌రావు తెలిపారు.

తపస్ నల్లగొండ మండల రూరల్ కమిటీ ఎన్నిక



శ్రీనివాస్



రామకృష్ణ

నల్లగొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం (తపస్) నల్లగొండ మండల రూరల్ శాఖ నూతన కమిటీని శుక్రవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా అన్నెబోయిన శ్రీనివాస్ (దోమలపల్లి హై స్కూల్), ప్రధాన కార్యదర్శిగా నిమ్మనగోటి రామకృష్ణ (నర్సింగ్‌భట్ల హైస్కూల్)లు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తామన్నారు. తమ ఎన్నికకు సహకరించిన జిల్లా అధ్యక్షుడు ఇరుగు శ్రీరామ్, ప్రధాన కార్యదర్శి బత్తిని భాస్కర్‌లకు కృతజ్ఞతలు తెలిపారు.

అభ్యర్థులు కొత్త బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వాలి

చిట్యాలరూరల్, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థులు కొత్త బ్యాంకు ఖాతా వివరాలను అందజేయాలని చిట్యాల ఎంపీడీవో ఎస్‌పీ విజయలక్ష్మి తెలిపారు. ఎన్నికల్లో సర్పంచ్, వార్డు సభ్యులుగా పోటీ చేసే అభ్యర్థులు నామినేషన్ పత్రాలతో పాటుగా ఏదేని బ్యాంకులో కొత్తగా జీరో కరెంటు ఖాతా తెరచి వివరాలను అందజేయాలని సూచించారు. అభ్యర్థులు ఈ విషయాన్ని తప్పనిసరిగా గుర్తుంచుకుని బ్యాంకు ఖాతాను తెరవాలని పేర్కొన్నారు.

ఆంగ్ల ఒలంపియాడ్ టెస్ట్‌లో జిల్లా స్థాయికి ఎంపిక

* ప్రతిభ చాటిన వల్లాల మోడల్ స్కూల్ విద్యార్థులు



జిల్లా స్థాయి ఎంపికైన విద్యార్థులతో ఉపాధ్యాయులు

శాలిగౌరారం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలం వల్లాల మోడల్ స్కూల్ విద్యార్థులు ఆంగ్ల ఒలంపియాడ్ టెస్ట్‌లో జిల్లా స్థాయిలో ఎంపికై తమ సత్తా చాటుకున్నారని ఆంగ్ల గైడ్ టీచర్ చిత్తలూరి సత్యనారాయణ తెలిపారు. ఇంగ్లీష్ ఒలంపియాడ్ టెస్ట్ జూనియర్స్ విభాగంలో అత్యధిక మా ర్కులు సాధించిన దర్శిత్‌భార్గవ్ ప్రథమస్థానంలో నిలిచి జిల్లా కాంపిటేషన్‌కి ఎంపికయ్యారు. అదే విధంగా సీనియర్స్ కేటగిరీలో 9వ తరగతి విద్యార్థిని శర ణ్య ఉపన్యాస పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన 7వ తరగతి విద్యార్థిని శ్రీవేద తమ సత్తా చాటారని చిత్తలూరి తెలిపారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, ఉపాధ్యాయులు విద్యార్థులను అభినందించారు.

ఈవ్‌టీజింగ్‌పై అవగాహన పెంపొందించాలి



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న షీటీం సభ్యులు

నల్లగొండ క్రైం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): ఈవ్‌టీజింగ్‌పై బాలబాలికల్లో అవగాహన పెంపొందించాలని షీటీం ఏఎస్‌ఐ రాంరెడ్డి అన్నారు. పానగల్‌లోని ఓ పాఠశాలలో శుక్రవారం ఈవ్‌టీజింగ్‌పై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అపరిచిత వ్యక్తులపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అత్యవసర పరిస్థితులల్లో షీటీంను సంప్రదించాలని కోరారు. బాలబాలికలతో పాటు మహిళ రక్షణ కోసం షీటీం అన్ని వేళల అందుబాటులో ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నర్సింహ, ఉమెన్ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మి పాల్గొన్నారు.

నామినేషన్ క్లస్టర్ కేంద్రాల పరిశీలన



కొత్తపల్లి నామినేషన్ కేంద్రంలో రికార్డులను పరిశీలిస్తున్న ఎంపీడీవో జ్యోతిలక్ష్మి

శాలిగౌరారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): శాలిగౌరారం మండలంలోని గురజాల, నూలగడ్డ కొత్తపల్లి గ్రామాల్లో ఏర్పాటు చేసిన నామినేషన్ క్లస్టర్ కేంద్రాలను హెల్ప్‌డెస్క్‌లను శాలిగౌరారం ఎంపీడీవో జ్యోతిలక్ష్మి పరిశీలించారు. అభ్యర్థుల నామినేన్ పత్రాలను రికార్డులను పరిశీలించి సిబ్బంది సలహాలు, సూచనలు ఇచ్చారు.

కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలి



ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సీఈవో మాధవరెడ్డి

నాంపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని రైతు ఉత్పత్తిదారుల సంఘం సీఈవో మాధవరెడ్డి అన్నారు. వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మండల రైతు ఉత్పత్తిదారుల సంఘం సీఈవో మాధవరెడ్డి సుంకిశాలలో శుక్రవారం ఆయన ప్రారంభించి మాట్లాడారు. తేమ శాతం తక్కువ వచ్చిన రైతుల ధాన్యాన్ని పరిశీలించి కొనుగోలు చేశారు. పెల్లలు, తేమ, తాలు లేకుండా ధాన్యాన్ని ఆరబెట్టి తీసుకురావాలని రైతులకు సూచించారు. ఈ కార్యక్రమంలో పవన్‌కళ్యాణ్, పురుషోత్తం, కిరణ్‌బాబు, అశోక్, వెంకటయ్య, రాములు తదితర రైతులు పాల్గొన్నారు.

బెల్ట్ షాపులు నడిపితే కఠిన చర్యలు

శాలిగౌరారం, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తున్న నేపథ్యంలో గ్రామాల్లో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ఉండేందుకు నేటి నుంచి బెల్ట్‌షాపులు మూసి వేయాలని ఎస్‌ఐ సైదులు తెలిపారు. శుక్రవారం రాత్రి ఆయన విలేకరులతో మాట్లాడారు. బెల్ట్‌షాపుల నిర్వాహకులు ఒకవేళ తెరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

పూలే స్ఫూర్తితో రిజర్వేషన్ల కోసం ఉద్యమించాలి

నల్లగొండటౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జ్యోతిరావుపూలే ఉద్యమ స్ఫూర్తితో బీసీలు 42శాతం రిజర్వేషన్ల కోసం ఉద్యమించాలని బీసీ జేఏసీ జిల్లా చైర్మన్ మున్నాస ప్రసన్నకుమార్ పిలుపునిచ్చారు. నలగొండ జిల్లా కేంద్రంలో ఉన్న యాదవసంఘం భవనంలో శుక్రవారం బీసీ జేఏసీ ఆధ్వర్యంలో మహాత్మాజ్యోతిరావు పూలే వర్ధంతి కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. అనంతరం క్లాక్‌టవర్ సెంటర్‌లో మహాత్మా జ్యోతిబా పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీసీ జేఏసీ చైర్మన్ మున్నాస ప్రసన్నకుమార్ మాట్లాడుతూ మహాత్మా జ్యోతిరావుపూలే ఉద్యమ స్ఫూర్తితో బీసీలు విద్య, ఉద్యోగాల్లో, రాజకీయ రిజర్వేషన్ల కోసం ఉద్యమించాలని కోరారు పూలే జీవిత చరిత్రను ప్రతీ విద్యార్థి, యువకుడు ఖచ్చితంగా చదవాలన్నారు. సమాజంలో అంటరానితనం నిర్మూలన కోసం అనేక ఉద్యమాలు చేసి అ క్షరజ్ఞానం లేనటువంటి రోజుల్లో ప్రతీ ఒక్క దళిత, బహుజన వర్గాలకు చదువు అందించాలనుకున్న గొప్ప ఉద్యమనాయకుడు పూలే అని కొనియాడారు. ఆయన ఆశయాల కోసం పనిచేయాలని, మహనీయుల ఆశయాలను సాధించడమే వారికి నిజమైన నివాళులర్పించినట్లని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి జేఏసీ జిల్లా చైర్మన్ అయితగోని జనార్ధన్‌గౌడ్, జేఏసీ ప్రధాన కార్యదర్శి గజ్జి అజయ్‌యాదవ్, కోఆర్డినేటర్ చెన్నూరి భరద్వాజ్, వైస్ చైర్మన్ వడ్డెబోయిన రామకృష్ణ, చిలకరాజు చెన్నయ్య, దుడ్డు కృష్ణమూర్తి, బక్కతట్ల వెంకన్న, పట్టణ జేఏసీ చైర్మన్ పుట్ట వెంకన్నగౌడ్, పట్టణ యూత్ జేఏసీ నాయకులు, చీరబోయిన వెంకన్న, శివ, నాగరాజు, సతీష్‌యాదవ్, శ్రీనివాస్, మహిళ జేఏసి కన్వీనర్ హైమ పాల్గొన్నారు.



పూలే విగ్రహానికి పూలమాలేసి నివాళులర్పిస్తున్న నాయకులు

శాలిగౌరారం: శాలిగౌరారం మండలం వల్లాల మోడల్ స్కూల్‌లో జ్యోతిరావు పూలే వర్ధంతిని నిర్వహించారు. పూలే చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా టీఎస్‌ఎంఎస్‌టీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు, ఆంగ్ల ఉపాధ్యాయుడు సత్యనారాయణ మాట్లాడుతూ అట్టడుగు వర్గాలకు చదువుకునే అవకాశం జ్యోతిరావుపూలే, సావిత్రీబాయి పూలే దంపతులు కల్పించారని, వారి ఆశయ సాధనకు కృషి చేయాలని అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ కృష్ణమోహన్, టీచర్లు సంపత్‌కుమార్, కె.శ్రీనివాస్, కృష్ణయ్య, శ్రీరాములు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న బీసీ సంక్షేమ సంఘం నాయకులు

నల్లగొండ కల్చరల్: బడుగు, బలహీన వర్గాల అభ్యున్నతికి పూలే ఎనలేని కృషి చేశారని సమాచార హక్కు పరిరక్షణ సమితి, ఎలక్షన్‌వాచ్ కమిటీ జాతీయ చైర్మన్ డాక్టర్ బొమ్మరబోయిన కేశవులు కొనియాడారు. సమాచార హక్కు సమితి ఆధ్వర్యం లో గురువారం నల్లగొండ పట్టణంలోని మహాత్మా జ్యోతిబాపూలే విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. చదువుతోనే అభివృద్ధి సాధ్యమని చెప్పిన మహనీయుడు జ్యోతిబా పూలే అని అన్నారు. ఈ కార్యక్రమంలో జలసాధన సమితి జాతీయ అధ్యక్షుడు దుశ్చర్ల సత్యనారాయణ, జీడిమెట్ల రమేష్, మేకల శ్రీహరి, యాదయ్య, వంశీ, తదితరులు పాల్గొన్నారు.

నల్లగొండ: ప్రభుత్వం జీవో నెంబర్ 46ప్రకారం బీసీలకు కేవలం 17శాతం మాత్ర మే రిజర్వేషన్ కల్పించి మోసం చేసిందని బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నేలపట్ల సత్యనారాయణ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని గడియారం సెంటర్‌లో జ్యోతిరావుపూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించకుండా ప్రభుత్వం మోసం చేయడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చొల్లేటి ప్రభాకర్, కంది సూర్యనారాయణ, నల్ల సోమ మల్లన్న, నకిరేకంటి కాశయ్య, వాసుదేవుల వెంకటనర్సయ్య, చిక్కుల రాములు, జివ్వాజీ ఇంద్రయ్య, కొల్లోజు సత్యనారాయణ, ఆదినారాయణ, సాయిబాబా, శంకర్, మల్లికార్జున్, కేశవులు తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ బిల్లులు ఇప్పించాలి

మర్రిగూడ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పూర్తి చేసినప్పటికి ఇప్పటి వరకు బిల్లులు రాలేదంటూ నర్సిరెడ్డిగూడెం ముంపు గ్రామ బాధిత భూ నిర్వాసితులు కలెక్టర్ ఇలా త్రిపాఠికి మొర పెట్టుకున్నారు. శుక్రవారం శివన్నగూడ గ్రామానికి ఎన్నికల కేంద్రాల పరిశీలనలో భాగంగా రావడంతో డిండి ఎత్తిపోతల పథకంలో భాగంగా చర్లగూడెం రిజర్వాయర్లు ముంపునకు గురైన నర్సిరెడ్డిగూడెం గ్రామ బాధిత భూ నిర్వాసితులు కలెక్టర్‌ను కలిశారు. నర్సిరెడ్డిగూడెం బాధితులకు ఇందిరమ్మ పథకం ద్వారా 55మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసి ప్రొసిడింగ్ పత్రాలను కూడా అందజేశారని కలెక్టర్‌కు తెలిపారు. స్పందించిన కలెక్టర్ చండూరు ఆర్డీవో శ్రీదేవిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. సమస్యను పరిష్కరిస్తామని నిర్వాసితులకు హామీ ఇచ్చారు. ఆమె వెంట ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో మున్నయ్య, ఎంఈవో శ్రీనివాస్, ఎంపీవో రవికుమార్ ఉన్నారు.

జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలి

* 3న మహాధర్నాను విజయవంతం చేయాలి

నల్లగొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలని, తమ పరిష్కారంలో ప్రభుత్వం అనుసరిస్తున్న నిర్లక్ష్య వైఖరిని నిరసిస్తూ డిసెంబరు 3న హైదరాబాద్‌లో నిర్వహించే మహాధర్నాను విజయవంతం చేయాలని టీయూడబ్ల్యూజే (ఐజేయూ) జిల్లా అధ్యక్షుడు గార్లపాటి కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. పోరాడి సాధించుకున్న తెలంగాణ రాష్ట్రంలో గత 12 సంవత్సరాల కాలంలో నిర్లక్ష్యానికి గురైన వర్గం జర్నలిస్టులు మాత్రమే అన్నారు. తెలంగాణ ఉద్యమ కాలంలో కీలక భూమిక పోషించిన జర్నలిస్టులను నిర్లక్ష్యం చేయడం సమంజసం కాదన్నారు. అక్రిడిటేషన్ పాలసీ వెంటనే ప్రకటించి కొత్త కార్డులను ఇవ్వాలని, ఆరోగ్య బీమా పథకాన్ని పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలను మంజూరు చేయాలని, వృత్తి కమిటీలను వెంటనే ఏర్పాటు చేయాలని, సంక్షోభంలో ఉన్న చిన్న, మధ్య తరగతి పత్రికలను ఆదుకోవాలని ఆయన కోరారు. న్యాయమైన డిమాండ్లపై ఒత్తిడి తీసుకరావడం కోసం జర్నలిస్టులు పోరుబాట పట్టాలని, ఇందులో భాగంగా డిసెంబరు 3న ఉదయం 10గంటలకు హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంక్ వద్ద ఉన్న రాష్ట్ర సమాచార శాఖ కమిషనర్ కార్యాలయం వద్ద జరిగే మహాధర్నాకు జర్నలిస్టులు వందలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

యూటీఎఫ్ సమావేశాలను విజయవంతం చేయాలి

కేతేపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నల్లగొండ జిల్లా కేంద్రంలో ఈ నెల 30వ తేదీన నిర్వహించే యూటీఎఫ్ జిల్లా విస్తృత స్థాయి సమావేశాలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆ సంఘం మండల అధ్యక్షుడు కాశిమల్ల నాగయ్య కోరారు. కేతేపల్లిలో సంఘం నాయకులు, ఉపాధ్యాయులతో కలిసి శుక్రవారం సమావేశం పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి విద్యాయాత్రలు, ఎన్‌రోల్‌మెంట్ డ్రైవ్‌ల నిర్వహణలో తమ సంఘం ముందుంటుందన్నారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూటీఎఫ్ అలుపెరగని పోరాటం చేస్తుందన్నారు. ఈ క్రమంలో ఈ నెల 30వ తేదీన నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించే సంఘం విస్తృత స్థాయి సమావేశాలకు ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరుకావాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు జయసాగర్, శ్యామయ్య, గోపయ్య, వీరభద్రయ్య, రమేష్, శంకరయ్య, నర్సిరెడ్డి, యాదగిరి, శ్రీలత, యాదమ్మ పాల్గొన్నారు.



కేతేపల్లిలో పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఉపాధ్యాయులు

ఖర్చులు మీరే భరించాలి!

(5వ పేజీ తరువాయి)

స్థానిక నేతలకు అప్పగించి, వారి అనుయాయులున్నచోట్ల వారిని బరిలో ఉంచేలా సూచనలు, సలహాలు చేస్తున్నారు. బీఆర్‌ఎస్ నేతలు పార్టీ నాయకులు ఎవరు బరిలో నిలుస్తామంటే వారిని పోటీ చేయాల్సిందిగా సూచిస్తున్నారు. మొత్తంగా ఏ పార్టీ అభ్యర్థి అయినా పోటీచేయాలంటే డబ్బును సొంతంగా సమకూర్చుకోవాల్సిందేనని తేల్చిచెబుతుండడంతో డబ్బుల్లేకుండా పార్టీల్లో పనిచేస్తున్న నాయకులు డైలమాలో పడి, అవకాశాలు వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని సీనియర్లు, దీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్నవారు వాపోతున్నారు.

విద్యుత్‌శాఖ టెండర్లలో గోల్‌మాల్!

(5వ పేజీ తరువాయి)

పనులు అప్పగించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. విద్యుత్‌శాఖలోని ఓ అధికారితో పాటు మరో ఇద్దరు అధికారుల బంధువులకే అప్పగించారని గుసగుసలు వినవిస్తున్నాయి. అయితే 15 రోజుల పాటు టెండర్లను వాయిదా వేసిన అధికారులు ఈ నెల 27 రాత్రే బినామీలకు, బంధువులకు పనులు అప్పగించినట్లు సమాచారం. ప్రభుత్వ ఖజానాకు గండిపడేలా, కాంట్రాక్టర్లకు లాభం చేకూరేలా వ్యహరిస్తూ పనులు అప్పగించడం వివాదానికి దారితీస్తోంది. దీనికి తోడు కొందరు కాంట్రాక్టర్లకు సమాచారం ఇవ్వకుండానే రాత్రిపూట టెండర్లు ఖరారు చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. పనులు దక్కని కాంట్రాక్టర్లు ఉన్నతాధికారుల దగ్గరకు వెళ్లి నిబంధనలకు విరుద్ధంగా ఎలా వ్యవహరిస్తారని ప్రశ్నిస్తే రాజకీయ ఒత్తిడి అని సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. ఓ అధికారి బదిలీ అయ్యాక కిందిస్థాయి అధికారులు టెండర్లను ఖరారు చేయడం, పాత తేదీలపై టెండర్లు ఇచ్చేలా వ్యవహారం నడిచినట్లు తెలిసింది. తక్కువ ధరకు పనులు చేస్తామని ముందుకు వచ్చిన కాంట్రాక్టర్లను కాదని అధిక ధరవేసి ప్రభుత్వ ఖజానాకు నష్టం వాటిల్లేలా చేస్తున్న వారికి ఇవ్వడంతో పాటు బంధువులకు అప్పగించడం చర్చనీయాంశంగా మారింది. దీనిపై విద్యుత్‌శాఖ కమర్షియల్ ఏఈ శ్రీనివాసరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఇంకా ఏమి కాలేదంటూ వ్యాఖ్యానించడమేగాక, తాను డీఈ వద్ద ఉన్నానంటూ పూర్తి సమాచారం ఇవ్వకుండా తప్పించుకున్నారు. అయితే బదిలీ అయి హైదరాబాద్ వెళ్లిన డీఈ వద్దనే ఆయన ఉండటం కొసమెరుపు.

కాంగ్రెస్‌లో బొప్పారం మాజీ సర్పంచ్ చేరిక

కేతేపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని బొప్పారం గ్రామ తాజా మాజీ సర్పంచ్ కర్ర ప్రభాకర్‌రెడ్డి తన అనుచరులతో కలిసి బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి కాంగ్రెస్ పార్టీలో చేరారు. శుక్రవారం తన అనుచరులతో కలిసి నకిరేకల్ పట్టణంలోని ఎమ్మెల్యే వేముల వీరేశం క్యాంపు కార్యాలయానికి వెళ్లిన ఆయనకు ఎమ్మెల్యే వీరేశం సాదరంగా ఆహ్వానించి కండువా కప్పి పార్టీలో చేర్చుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే వీరేశం మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి అందరూ తమతో కలిసి రావాలని కోరారు. పార్టీలో పాత, కొత్త తారతమ్యం ఉండదన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కె.శ్రీనివాసయాదవ్, నాయకులు జి.మాధవరెడ్డి, అంజన్‌కుమార్, ఎస్.కేశయ్య తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక

కట్టంగూరు: మండలంలోని నల్లకుంటబోలు గ్రామానికి చెందిన బీఆర్‌ఎస్ నాయకులు కొంతమంది ఎమ్మెల్యే వేముల వీరేశం సమక్షంలో శుక్రవారం రాత్రి నకిరేకల్ క్యాంపు కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. చేరిన వారికి ఎమ్మెల్యే వీరేశం కాంగ్రెస్ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారిలో నరేష్, యాదయ్య, ఉపేందర్, రఘుపతిలతో పాటు మరికొంత మంది ఉన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పెద్ది సుక్కయ్య పాల్గొన్నారు.

బీజేపీలో చేరిన బీఆర్‌ఎస్ నాయకుడు

నార్కట్‌పల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని అమ్మనబోలుకు చెందిన బీఆర్‌ఎస్ నాయకుడు బందెల లింగయ్య శుక్రవారం బీజేపీలో చేరారు. బీజేపీ నాయకుడు రాపోలు సంతోష్ లింగయ్యకు పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఆయన బీజేపీ తరఫున అమ్మనబోలు సర్పంచ్ అభ్యర్థిగా పోటీ చేయనున్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ నాయకులు వెంకటేశం, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

గ్యారెంటీల పేరిట మోసం చేసిన కాంగ్రెస్


చిట్యాలరూరల్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం విస్మరించిందని, గ్యారెంటీల పేరిట ప్రజలను మో సం చేసిందని పిట్టంపల్లి మాజీ సర్పంచ్ ఈసం బాబు, వెలిమినేడు-2 మాజీ ఎంపీటీసీ దేవరపల్లి సత్తిరెడ్డి విమర్శించారు. చిట్యాల మండలం పిట్టంపల్లిలో బీఆర్‌ఎస్ గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులు ప్రభాకర్‌రెడ్డి, కిరణ్‌యాదవ్ ఆధ్వర్యంలో గురువారం రాత్రి కాంగ్రెస్‌కు చెందిన మేడి శేఖర్, ముదుపు నరేష్‌రెడ్డి, మేడి శివకుమార్ బీఆర్‌ఎస్‌లో చేరారు. గ్రామాల అభివృద్ధి బీఆర్‌ఎస్‌తోనే సాధ్యమని కేసీఆర్ హయాంలో గ్రామాలన్నీ అభివృద్ధిలో కళకళలాడాయన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ యువజన సంఘం మండల అధ్యక్షుడు తుమ్మల నాగరాజురెడ్డి, సామ మహేందర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, కిరణ్, మేడి రవీందర్, మేడి రాజ్‌కుమార్, మెట్టు నరేష్, జంగిడి వెంకటేష్, మెట్టు నర్సింహ, వెంకట్‌రెడ్డి, మేడి శేఖర్, నరేష్‌రెడ్డి, మేడి శివకుమార్ పాల్గొన్నారు.

అయ్యప్ప ఆలయంలో కొనసాగుతున్న స్వాముల భిక్ష

నార్కట్‌పల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): నార్కట్‌పల్లి మండల కేంద్రంలోని హరిహరపుత్ర అయ్యప్పస్వామి దేవాలయంలో నిత్యపూజలు కొనసాగుతున్నాయి. అయ్యప్ప మాల ధరించిన స్వాముల భజనకీర్తనలతో ప్రతీ రోజు ఉదయం సాయంత్రం ఆలయం మారుమ్రోగిపోతుంది. 41 రోజుల దీక్ష చేపట్టిన అయ్యప్పస్వాములకు దాతల విరాళాలతో ఆలయంలోనే ప్రతీరోజూ భిక్షదానం జరుగుతోంది. ప్రతీ రోజు 200 మందికి పైగా ఈ ఆలయంలో భిక్ష చేసేలా ఏర్పాట్లు చేశారు. ఆలయంలో స్వాముల భిక్ష, అల్పాహారం, ప్రతీ రోజు నిత్యపూజలు, మండల పూజ నిర్వహణ కోసం భక్తులు ముందుకు రావాలని ఆలయ చైర్మన్ గురుస్వామి బెల్లి వెంకన్న కోరారు.

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి మండలం మాండ్ర గ్రామానికి చెందిన గురుస్వామి గుండు నర్సింహ అయ్యప్పస్వామి నెలవైన శబరిమల ఆలయ ప్రధానతంత్రి (పూజారి) రాజీవ్‌తో మాలధారణ చేశారు. అయ్యప్ప మాలధారులు తనకంటూ ప్రత్యేకతను చాటుకుంటున్నారు.

ఆంధ్రజ్యోతి
గరిష్ఠం 27.5
కనిష్ఠం 17.0
ANDHRAJYOTHY
నల్లగొండ
5
శనివారం 29 నవంబరు 2025



ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.0450)	582 (288.7830)	15,272	15,272
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	644.20 (4.25)	722.10	1,031.04
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	173.193 (43.0123)	3,000	2,000

చికెన్ ధరలు | లైవ్ : రూ.120 | డ్రెస్ : రూ.200 | స్కిన్‌లెస్ : రూ.220

ఎన్నికల ఖర్చు విపరీతంగా పెరగడంతో గ్రామంలో క్రేజ్ ఉన్న సర్పంచ్ పదవికి పోటీచేసేందుకు కీలక నాయకులు, క్రియాశీల క కార్యకర్తలు జంకుతున్నారు. దశాబ్దాలుగా పార్టీకి నికార్సయిన కార్యకర్తగా ఉన్నా, ఎన్నికలకు వచ్చేసరికి డబ్బు ఖర్చుచేస్తేనే గెలుస్తారనే వాతావరణం వారి ఆశలకు తూట్లు పొడుస్తోంది.

- (ఆంధ్రజ్యోతిప్రతినిధి,నల్లగొండ)

ఖర్చులు మీరే.. భరించాలి!



- గెలిచివస్తే అభివృద్ధికి తోడ్పాటు ఇస్తాం
- స్పష్టం చేస్తున్న మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులు
- ప్రతిపక్ష పార్టీలదీ అదే మాట
- పార్టీ నుంచి డబ్బుల్లేవని చెబుతుండడంతో ఖంగుతింటున్న ఆశావహులు
- పార్టీకి సేవచేసినా ఫలితం దక్కలేదనే నిర్వేదంలో సీనియర్లు

దశాబ్దాలుగా పార్టీ జెండా మోసి గుర్తింపు తెచ్చినా, ప్రస్తుత ఎన్నికల్లో పోటీ అవకాశం వస్తే అధినాయకులు ముందుండి అన్నివిధాలా అండగా ఉంటారనే నమ్మకంతో గ్రామ సీనియర్ నాయకులు ఉన్నారు. అయితే అలాంటి ఆశలేవీ పెట్టుకోవద్దని, సర్పంచ్ ఎన్నికల్లో అభ్యర్థులకు ఎవరికీ తాము డబ్బు, మద్యం అందించలేమని, గెలిచివస్తే అభివృద్ధి పనులు చేసి పెడతామని మంత్రులు, ఎమ్మెల్యే లు, ఇతర ప్రజాప్రతినిధులు తేల్చిచెబుతుండడంతో ఆశావహులు ఖంగుతింటున్నారు. అన్ని పార్టీల అధినాయకులు ఇదే చెబుతుండడంతో డబ్బులేని నాయకులు పోటీకి వెనకంజవేస్తున్నారు.

భారీ ఖర్చు తప్పదనే అంచనాలు

పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్ పదవికి పోటీ చేసే అభ్యర్థుల ఖర్చు భారీగా పెరిగిపోయింది. గత పదేళ్లలో వచ్చిన మార్పులు, పదవి వస్తే చాలనే తలంపుతో పోటీపడే అభ్యర్థులు ఎంతకైనా తెగించి ఉన్న ఆస్తులను విక్రయించి గ్రామాల్లో సర్పంచులుగా పోటీచేసేందుకు సిద్ధమవుతుండడంతో ఖర్చుకు అదుపులేని పరిస్థితి నెలకొంది. చిన్నపంచాయతీల్లో సైతం ఒక్కో అభ్యర్థి గెలిచినా ఓడినా కనీసం రూ.10లక్షలు ఖర్చు చేయాల్సి వస్తోందని, గెలిచే అభ్యర్థి ఇంకో రూ.2లక్షలు అదనంగా పెట్టకపోతే గెలవలేరని చెబుతున్నారు. పార్టీ క్యాడర్‌ని సైతం సంతృప్తిపరిస్తే తప్ప ఓట్లు పడని దుస్థితికి రాజకీయం చేరిందని సీనియర్ నాయకులు వాపోతున్నారు. మద్యం, మాంసం పంపిణీలతో పరిమితమవకుండా పోలింగ్‌కు ముందు రోజుల్లో నగదు పంపిణీ, చీరలు, వెండి భరిణెల వంటి పంపకాలు తప్పవని చెబుతున్నారు. ఓపెన్ కేటగిరీ, బీసీ రిజర్వేషన్లు అయినచోట్ల కొన్ని రాజకీయ ప్రతిష్ఠగలిగినచోట్ల, నియోజకవర్గాల్లో ద్వితీయ శ్రేణి నేతలుగా పోటీచేస్తున్న నాయకులు ఉన్నచోట్ల భారీగా ఖర్చుకు సిద్ధమైనట్లు గ్రామాల్లో చర్చసాగుతోంది.

ఏకగ్రీవాలు చేయాలన్నా కనీసం రూ.20లక్షల నుంచి ధర మొదలవుతోందని, ఆపై ఎవరు ఎక్కువ ఇస్తే వారికి సర్పంచ్ పదవిని ఇస్తున్నారని సమాచారం. ఉమ్మడి జిల్లాలో తొలివిడత ఎన్నికలు జరిగే గ్రామాల్లో ఇప్పటికే నామినేషన్ల సందర్భంగా ర్యాలీలకు వచ్చినవారికి దావతులు షరా అయ్యాయి. అదేవిధంగా ఏకగ్రీవాలయ్యే చోట్ల సమావేశాలు నిర్వహించా బేరాలు మాట్లాడి ఫైనల్ చేస్తున్నారు. మంత్రులు సహా ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు అందరూ అభ్యర్థుల ఎంపికలో జోక్యం చేసుకోకుండా...

- మిగతా 8వ పేజీలో...

నామినేషన్ కౌంటర్ 1వ రోజు

జిల్లా	28న సర్పంచ్‌కు	ఇప్పటివరకు మొత్తం	వార్డు స్థానాలకు	ఇప్పటివరకు మొత్తం
నల్లగొండ	365	786	735	969
సూర్యాపేట	159	366	142	180
యాదాద్రి	176	381	648	782
మొత్తం	700	1533	1519	1931

విద్యుత్‌శాఖ టెండర్లలో గోల్‌మాల్!

రాత్రికి రాత్రే ఖరారు చేసిన వైనం
బంధువులకు పనులు కట్టబెట్టినట్లు ఆరోపణలు



జిల్లా విద్యుత్ శాఖలో టెండర్లలో గోల్‌మాల్ జరిగినట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. పనులు చిన్నవే అయినా, వాటిని నిబంధనల ప్రకారం అప్పగించాల్సి ఉండగా, దొడ్డిదారిన రాత్రికి రాత్రే టెండర్లను ఖరారు చేయడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఓ అధికారి సమీప బంధువులకు, బినామీలకు పనులను కట్టబెట్టినట్లు వినవస్తోంది.

- (ఆంధ్రజ్యోతి,నల్లగొండ/ నల్లగొండ టౌన్)

పాతబడిన విద్యుత్ స్తంభాలను మార్చి తీగల ఏర్పాటు, ఇతర పనుల కోసం ఈనెల మొదటి వారంలో విద్యుత్‌శాఖ అధికారులు టెండర్లను పిలిచారు. వాటిని ఈ నెల 12వ తేదీనే ఖరారు చేయాల్సి ఉండగా, వివిధ కారణాలతో వాయిదా వేశారు.

జిల్లా కేంద్రంలో 11 కేవీఫీడర్ పనులతో పాటు, మరిన్ని పనుల కోసం రూ.1,45,448తో షార్ట్ టెండర్ పిలిచారు. అదేవిధంగా 1.25కిలోమీటర్ల 33/11కేవీ ఇంటర్ లింకింగ్ లైన్ పనులను మునుగోడు సబ్‌డివిజన్ పరిధిలోని గూడపూర్‌లో చేపట్టేందుకు రూ.1,56,445లతో టెండర్లను ఆహ్వానించారు. మునుగోడు పరిధిలోని చెల్మెడలో ఎక్స్‌టెన్షన్ పనుల కోసం మరో రూ.1,24,703లతో టెండర్ల ను ఆహ్వానించారు. అయితే ఒక్కో పనికి 10 మంది చొప్పున మొత్తంగా 30మంది టెండర్లలో పాల్గొన్నారు.

లెస్ టెండర్ దాఖలుచేసిన వారిని కాదని

ప్రభుత్వ నింబంధన మేరకు టెండర్లను ఖరారు చేయాల్సి ఉండగా, పలు కారణాలను చూపుతూ తక్కువ ధర కోట్‌చేసిన వారిని కాదని, అధిక ధర కోట్‌చేసిన వారికి కట్టబెట్టడం పలు అనుమానాలకు తావిస్తోంది. ఈ టెండర్లలో 8మంది వరకు 15శాతం తక్కువ ధర కోట్ చేసి టెండర్లు దక్కించుకోవాలని ప్రయత్నించగా, ముగ్గురు అధిక కోట్‌చేసినా వారికి...

- మిగతా 8వ పేజీలో...

నూతన ఉత్పత్తుల తయారీపై దృష్టి సారించాలి



జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న కలెక్టర్ ఇలాత్రిపాఠి

నల్లగొండ (కలెక్టరేట్), నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మహిళా సంఘాల సభ్యులు నూతన ఉత్పత్తుల తయారీపై దృష్టి సారించి, ఆర్థికంగా మరింత ముందుకు ఎదగాలని కలెక్టర్ ఇలాత్రిపాఠి అన్నారు. సికింద్రాబాద్ బొల్లారంలోని రాష్ట్రపతి నిలయంలో నిర్వహిస్తున్న భారతీయ కళా మహోత్సవ్‌కు జిల్లా నుంచి వెళుతున్న స్వయం సహాయక మహిళా సంఘాల అధ్యక్ష, కార్యదర్శుల ప్రత్యేక బస్సుకు శుక్రవారం ఆమె జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద జెండా ఊపి ప్రారంభించారు. కళా మహోత్సవ్‌లో దేశంలోని వివిధ ప్రాంతాల్లో తయారుచేసిన పలు రకాల ఉత్పత్తులను ప్రదర్శించనున్నట్లు తెలిపారు. మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులు పొదుపు, ఆర్థిక అంశాలతో పాటు, సామాజిక అంశాలపై అవగాహన కలిగి ఉండాలని అన్నారు. జిల్లాలోని మహిళా స్వయం సహాయక సంఘాలు నూతన ఆలోచనలతో కొత్త ఉత్పత్తులను తయారు చేయడంపై దృష్టి సారించాలని కోరారు. కార్యక్రమంలో డీఆర్‌డీవో శేఖర్‌రెడ్డి, డీపీఎంలు, ఏపీఎంలు పాల్గొన్నారు.

పోలీసులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

ఎస్పీ శరత్‌చంద్రపవార్



సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ శరత్ చంద్రపవార్

నల్లగొండక్రైం, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): పోలీస్ అధికారులు, సిబ్బంది ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. జిల్లా పోలీస్ కార్యాలయంలో శుక్రవారం పోలీస్ ఉద్యోగులు, కుటుంబసభ్యులకు మెగా వైద్యశిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసులు విధి నిర్వహణలో ఒత్తిడి కారణంగా సమయానికి ఆహారం, నిద్ర లేకపోవడం వల్ల అనేక రకాల ఆరోగ్య సమస్యలు ఎదుర్కొనే అవకాశాలు ఉంటాయన్నారు. దీనిని దృష్టిలో ఉంచుకొని ఆరోగ్యం విషయంలో పలు జాగ్రత్తలు పాటించాలన్నారు. ప్రతీరోజు వ్యాయామం, నడక, యోగా లాంటివి చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ రమేష్, ఎస్‌బీ డీఎస్పీ మల్లారెడ్డి, డీఎస్పీ శివరాంరెడ్డి, ఏఆర్‌డీఎస్పీ శ్రీనివాస్‌తో పాటు సాయికిరణ్, డాక్టర్ రమేష్, డాక్టర్ పుల్లారావు, డాక్టర్ రాజేష్, డాక్టర్ రవీంద్రనాథ్, ఫోకస్ రివర్ డయాగ్నస్టిక్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

క్రీడలతో మానసికోల్లాసం

క్రీడలు మానసికోల్లాసంతో పాటు శారీరక సామర్థ్యం, క్రమశిక్షణను పెంపొందిస్తాయని ఎస్పీ శరత్‌చంద్రపవార్ అన్నారు. జిల్లా కేంద్రంలో శుక్రవారం ఇంటర్ కాలేజీ పోటీలను ప్రారంభించి మాట్లాడారు. క్రీడల్లో గెలుపు ఓటములు సహజమని, ఓటమి గెలుపునకు నాంది అన్నారు. యువత చెడు వ్యసనాలకు బానిసలు కాకుండా ఉన్నత లక్ష్యాలను ఎంచుకొని ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ శివరాంరెడ్డి, వన్‌టౌన్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ సైదులు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలి

నల్లగొండ, స్పోర్ట్స్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు క్రీడల్లోనూ రాణించాలని, పాఠశాల స్థాయి నుంచే ఆసక్తి ఉన్న క్రీడల్లో శిక్షణ పొందాలని నల్లగొండ ఆర్డీవో అశోక్‌రెడ్డి, డీఈవో బొల్లారం భిక్షపతి అన్నారు. జిల్లా కేంద్రంలోని మేకల అభినవ్ స్టేడియంలో విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం నిర్వహించిన పీఎంశ్రీ పాఠశాలల జిల్లా స్థాయి క్రీడా పోటీలను వారు ప్రారంభించి మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణిస్తే ఉన్నత స్థాయి ఎదగవచ్చని అన్నారు. ప్రభుత్వం క్రీడలకు అధిక ప్రాధాన్యమిస్తుందని, విద్యార్థులు ఆటలకు సమయాన్ని కేటాయించాలన్నారు.

ఈ పోటీలకు జిల్లాలో 43 పీఎంశ్రీ పాఠశాలల నుంచి ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ క్రీడలకు సంబంధించిన జట్లు పాల్గొన్నాయి. ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, అథ్లెటిక్స్ ఆటల్లో గెలుపొందిన జట్లను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశారు. సుమారు 1000 మంది క్రీడాకారులు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో మాజీ డీవైఎస్‌వో, ఎస్‌జీఎఫ్-19 కార్యదర్శి కుంభం నర్సిరెడ్డి, ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి దగ్గుపాటి విమల, వ్యాయామ ఉపాధ్యాయులు శ్రీనువాస్, నాగరాజు, శంభులింగం, బొమ్మపాల గిరిబాబు, వివిధ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

నామినేషన్ల ప్రక్రియను సమర్థంగా నిర్వహించాలి

కలెక్టర్ ఇలా త్రిపాఠి



సరంపేటలో నామినేషన్ కేంద్రాన్ని పరిశీలించి సూచనలు చేస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

మర్రిగూడ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): పంచాయతీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియను సమర్థంగా నిర్వహించాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అధికారులను ఆదేశించారు. శుక్రవారం మండలంలోని క్లస్టర్ పరిధిలోని సరంపేట శివన్నగూడ, మర్రిగూడ, ఎన్నికల నామినేషన్ల కేంద్రాలను ఆమె తనిఖీ చేసి పరిశీలించారు. నామినేషన్ల కేంద్రాలకు వెళ్లి నామినేషన్ ధ్రువపత్రాలను పరిశీలించి, కంప్యూటర్ల సిస్టం పనితీరు వివరాలను చండూరు ఆర్డీవో శ్రీదేవిని అడిగి తెలుసుకున్నారు. నామినేషన్ వేసిన అభ్యర్థుల ధ్రువపత్రాలను తప్పనిసరిగా పరిశీలించాలని, నామినేషన్ పత్రంలో నూతన బ్యాంక్ అకౌంట్‌ను కూడా పొందుపర్చే విధంగా చూడాలని, ఎలాంటి లోపాలు లేకుండా ఇబ్బందులకు తావివ్వకుండా చూడాలని అధికారులకు సూచించారు. కలెక్టర్‌తో ఎంపీడీవో మున్నయ్య, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీవో రవికుమార్, ఎంఈవో శ్రీనివాస్ ఉన్నారు.

ఉపాధ్యాయురాలిగా కలెక్టర్

కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో గణిత ఉపాధ్యాయురాలుగా మారి కలెక్టర్ విద్యార్థులకు పాఠాలు బోధించారు. అనంతరం బాలికల పాఠశాలలో విద్యార్థుతో ముచ్చటించారు. పూర్తయిన సిలబస్‌లో నుంచి విద్యార్థులను కలెక్టర్ ప్రశ్నలు అడిగారు. వసతి గృహంలో మెనూ పాటిస్తున్నారా? లేదా అని ఆరా తీశారు. ఒక విద్యార్థిని పుట్టినరోజును కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్డీవో శ్రీదేవి, తహసీల్దార్ జక్కరి శ్రీనివాసులు, ఎంపీడీవో మున్నయ్య ఉన్నారు.

చర్లగౌరారం నామినేషన్‌కేంద్రాన్ని తనిఖీ చేసిన ఎస్పీ

కనగల్: మండలంలోని చర్లగౌరారం జీపీలో సర్పంచ్‌ఎన్నికల్లో భాగంగా ఏర్పాటు చేసిన నామినేషన్‌స్వీకరణ కేంద్రాన్ని శుక్రవారం జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్, నల్లగొండ డీఎస్పీ శివరాంరెడ్డితో కలిసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా నిమినేషన్‌ప్రక్రియ సజావుగా సాగేందుకు కేంద్రం వద్ద తీసుకున్న భద్రత చర్యలను, బందోబస్తు ఏర్పాట్లను ఎస్పీ పరిశీలించారు. అనంతరం సిబ్బందికి పలు సూచనలు చేసారు. నామినేషన్‌కేంద్రంలోకి ధరావత్తులను సమర్పించే అభ్యర్థులను, వారిని ప్రతిపాదించే వారిని మాత్రమే అనుమతించాలన్నారు. ఎన్నికల నియమావళిని ఉల్లఘించే వారి పట్ల కఠినంగా వ్యవహరించాలన్నారు. వీరి వెంట చండూర్ సీఐ ఆదిరెడ్డి, వేద రక్షిత, ఎస్‌ఐ రాజీవ్‌రెడ్డి, కార్యదర్శులు సంతోష్, పద్మ, హరీష్ ఉన్నారు.

డిసెంబర్ 6న దేవరకొండకు సీఎం రేవంత్‌రెడ్డి రాక



దేవరకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి డిసెంబరు 6వ తేదీన రానున్నారు. దేవరకొండలో సీఎం బహిరంగ సభతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేయనున్నారు. కాగా అధికారికంగా ప్రకటించాల్సి ఉంది. సీఎం రాక సందర్భంగా దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ ఏర్పాట్లు చేస్తున్నారు. కొండమల్లేపల్లి మండలం పెద్దికల్ పహాడ్‌లో రూ.200 కోట్లతో నిర్మించనున్న ఇంటిగ్రేటెడ్ కళాశాలకు, రూ.442 కోట్లతో లైనింగ్ పనులకు, డిండి, ఎత్తిపోతలపథకం ఎదుళ్ల వెయిన్ కెనాల్‌కు రూ.1,800 కోట్లతో పనులకు శంకుస్థాపన చేయనున్నారు. అలాగే నేరేడుగొమ్ములో రూ.47 కోట్లతో 132/33 కేవీ సబ్‌స్టేషన్, ఎస్టీ సబ్‌ప్లాన్ నిధులు రూ.28 కోట్లతో రోడ్ల నిర్మాణ పనులతో పాటు దేవరకొండ మున్సిపాలిటీలోరూ.20 కోట్లతో సీసీ రోడ్ల నిర్మాణ పనులకు సీఎం రేవంత్‌రెడ్డి శంకుస్థాపన చేయనున్నట్లు ఎమ్మెల్యే బాలునాయక్ తెలిపారు బహిరంగ ఎక్కడ నిర్వహిస్తారో అనేది ఖరారు కావాల్సి ఉంది.

స్థానిక ఎన్నికల్లో సత్తా చాటాలి

పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్



పీసీసీ అధ్యక్షుడిని గజమాలతో సత్కరిస్తున్న పున్నా కైలాష్, ఓయూ విద్యార్థి సంఘాల నాయకులు

నల్లగొండ, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ శ్రేణులను సమన్వయం చేసుకుంటూ స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటాలని పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్ సూచించారు. డీసీసీ అధ్యక్షుడిగా ఎన్నికైన పున్నా కైలాస్ నేత శుక్రవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో పీసీసీ అధ్యక్షుడిని మర్యాదపూర్వకంగా కలిసి, గజమాలతో సత్కరించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్‌తోనే సామాజిక న్యాయం సాధ్యమవుతుందని, పార్టీలో బలహీన వర్గాలకు పెద్దపీట వేయాలనే రాహుల్‌గాంధీ నిర్ణయం అమలు చేయడంలో భాగంగానే డీసీసీ అధ్యక్షుల నియామకాల్లో బీసీలకు పెద్దపీట వేశామని స్పష్టం చేశారు. కాంగ్రెస్‌లో కష్టపడిన కార్యకర్తలకు తప్పకుండా గుర్తింపు ఉంటుందనేందుకు కైలాస్‌నేత నియామకమే ఉదాహరణగా భావించాలని పీసీసీ అధ్యక్షుడు పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షుడిగా నియమితులైన కైలాష్‌ని అభినందించారు. వచ్చిన అవకాశాలను బాధ్యతగా భావించి మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ముఖ్యనేతలందరి నుంచి మొదలుకొని సామాన్య కార్యకర్తల వరకు అందరి సూచనలు, సలహాలు తీసుకుంటూ రాహుల్ గాంధీ ఆశిస్తోన్న రీతిలో పార్టీని బలోపేతం చేయాలని కైలాష్‌కు పీసీసీ అధ్యక్షుడు సూచించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అమలుచేస్తున్న ప్రజా సంక్షేమ, అభివృద్ధి పథకాలను వాడవాడలా తెలియజేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో వందశాతం ఫలితాలు కాంగ్రెస్‌కు అనుకూలంగా వచ్చేలా పనిచేయాలని పీసీసీ అధ్యక్షుడు సూచించారు.

తనపై నమ్మకంతో డీసీసీ అధ్యక్షుడిగా అవకాశం కల్పించిన సీఎం రేవంత్‌రెడ్డి, పీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్, మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, మాజీమంత్రి కుందూరు జానారెడ్డి, ఎంపీలు రఘువీర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వేముల వీరేశం, బాలూనాయక్, జైవీర్‌రెడ్డి, బత్తుల లక్ష్మారెడ్డి, ఎమ్మెల్యే శంకర్‌నాయక్‌ని మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలియజేసినట్లు తెలిపారు. అందరి సహకారం, సమన్వయంతో జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేస్తానని కైలాస్‌నేత పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థి సంఘాల నాయకులు, రాష్ట్ర కాంగ్రెస్ నాయకులు కైలాస్‌ని అభినందించారు. చరణ్‌కౌశిక్‌యాదవ్, మానవతా రాయ్, శ్రీహరినాయక్, లింగంయాదవ్, రాంబాబునాయుడు, సైదులుయాదవ్, వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌తో పొత్తుకు సీపీఐ సుముఖం

ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం

చండూరు, నవంబరు28 (ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ పార్టీల పొత్తు ప్రశ్నార్థకంగా మారింది. గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్, సీపీఐ కలిసి పనిచేసినా, ఈ స్థానిక సంస్థల ఎన్నికల్లో కూడా తమ పార్టీ కాంగ్రెస్‌తో పొత్తుకు సిద్ధంగా ఉన్నట్లు తెలిపారు. పొత్తు విషయంపై కాంగ్రెస్ పార్టీ నుంచి ఎలాంటి సంకేతాలు రావడం లేదని ఆ పార్టీ ఎమ్మెల్సీ నెల్లికంటి సత్యం అన్నారు. సీపీఐ కొంత బలంగా ఉన్న మునుగోడు నియోజకవర్గంలో కూడా అన్ని స్థానాల్లో పోటీకి సిద్ధంగా ఉన్నామని, కానీ కాంగ్రెస్ పార్టీతో మిత్రబంధం కారణంగా సీట్ల సర్దుబాటు, పొత్తుల కోసం ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు. కాంగ్రెస్ పార్టీతో పొత్తుకు తమ పార్టీ సుముఖంగా ఉన్నట్లు వెల్లడించారు. రాష్ట్రంలో తమ పార్టీ బలంగా ఉన్న చోట తమ పార్టీ అభ్యర్థులు పోటీ చేసే అవకాశం కల్పించాలని స్పష్టం చేశారు. తాము బలం లేని చోట కాంగ్రెస్ పార్టీకి, ఇతర వామపక్ష పార్టీలకు మద్దతు ఇస్తామన్నారు. కనీసం మునుగోడులో పొత్తుపై ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డికి వివరించగా ఇంకా స్పందించకపోవడం, నామినేషన్ల పక్రియ నేటితో ముగుస్తుండటంతో, ఇరు పార్టీలకు చెందిన కార్యకర్తలు, ఆశావాహులు ఆందోళన చెందుతున్నారు. వీలైన స్థానాల్లో సీపీఐ పోటీ చేస్తుందని, ఆ దిశగా ప్రతీ కార్యకర్త అత్యధిక స్థానాల్లో గెలుపొందేలా కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. మునుగోడు నుంచే ప్రాతినిధ్యం వహిస్తున్న సీపీఐ ఎమ్మెల్సీ సత్యం క్షేత్రస్థాయిలో తమ పట్టు నిలుపుకోవడానికి ప్రయత్నిస్తున్నారు. సీపీఐతో పొత్తుకు ప్రయత్నిస్తున్నానని, కొన్ని చోట్ల పొత్తు కుదరకపోతే స్నేహపూర్వకంగా తమ పార్టీ అభ్యర్థులు బరిలో ఉంటారని మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి వెల్లడించారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

దేవరకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బీఆర్‌ఎస్ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించనున్న దీక్షాదివస్‌ను విజయవంతం చేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. కేసీఆర్ ఉద్యమ పోరాటం గత పదేళ్లలో బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు గుర్తు చేయనున్నట్లు ఆయన తెలిపారు. దీక్ష దివస్ కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నేతలు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఓపెన్ స్కూల్‌లో చదివి రాణించాలి

దేవరకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): చదువు మానేసిన వారు 10వ తరగతి, ఇంటర్ దూర విద్యలో పరీక్షలు రాసి ఉత్తీర్ణులై విద్యలో రాణించాలని జిల్లా ఓపెన్ స్కూల్ కోఆర్డినేటర్ సత్యమ్మ అన్నారు. శుక్రవారం దేవరకొండలో ఓపెన్‌స్కూల్ సొసైటీ ఆధ్వర్యంలో కళాజాత బృందం ఓపెన్‌స్కూల్ విద్యపై అవగాహన కల్పించి మాట్లాడారు. చదువుకుంటేనే భవిష్యత్ ఉంటుందన్నారు. పరీక్షలు రాసి 10వ తరగతి, ఇంటర్‌లో ఉత్తీర్ణులై డిగ్రీలు కూడ చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో దేవరకొండ మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, ఓపెన్‌స్కూల్ అధికారులు గీత, ప్రవీణ, దేవరకొండ మునిసిపల్ శానిటరి ఇన్స్‌పెక్టర్ సురిగి శంకర్, కళాకారులు, అధికారులు పాల్గొన్నారు.

గ్రంథాలయాల అభివృద్ధికి కృషి

● దేవరకొండ ఎమ్మెల్యే బాలునాయక్



ఆర్‌వో వాటర్ ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే బాలునాయక్

దేవరకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): గ్రంథాలయాల అభివృద్ధికి కృషి చేస్తానని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. సంజీవని ట్రస్ట్ ఆధ్వర్యంలో దేవరకొండ గ్రంథాలయంలో రూ.3.20 లక్షలతో ఏర్పాటు చేసిన ఆర్‌వో వాటర్‌ప్లాంట్‌ను శుక్రవారం ఎమ్మెల్యే ప్రారంభించి మాట్లాడారు. గ్రంథాలయాలకు స్వచ్ఛంద సంస్థలు సహాయ, సహకారాలు అందించి సౌకర్యాలు కల్పించడం అభినందనీయమన్నారు. గ్రంథాలయాల అభివృద్ధికి తనవంతుగా సహాయ, సహకారాలు అందిస్తానని గ్రంథాలయ పఠనం ద్వారా విజ్ఞానం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో దేవరకొండ ము నిసిపల్ మాజీ చైర్మన్ ఆలంపల్లి నర్సింహ, ముక్కమళ్ల వెంకటయ్య గౌడ్, మునిసిపల్ కమిషనర్ సుదర్శన్, పున్న వెంకటేశ్వర్లు, శ్రీశైలం యాదవ్, సైదులు, కొర్ర రాంసింగ్, అధికారులు పాల్గొన్నారు.

చెకుముకి టాలెంట్ టెస్టులో ప్రతిభ

మిర్యాలగూడ టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): చెకుముకి టాలెంట్ టెస్టులో స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. వారిని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షుడు గుత్తికొండ సుదర్శన్‌రెడ్డి శుక్రవారం పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో అభినందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ మండలస్థాయిలో నిర్వహించిన పోటీల్లో పాఠశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని తృతీయ స్థానంలో నిలవ ం ఆదర్శనీయమన్నారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో ప్రథమస్థానంలో నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఉపేందర్, స్వామి, జానయ్య, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

హోంగార్డు కుటుంబానికి ఆర్థిక సాయం



కిషన్ భార్యకు నగదును అందిస్తున్న సీఐ శ్రీనునాయక్, ఎస్ఐ ముత్తయ్య

నాగార్జునసాగర్, నవంబరు28(ఆంధ్రజ్యోతి):నాగార్జునసాగర్ హిల్‌కాలనీ పోలీస్‌స్టేషన్‌లో(విజయపురి నార్త్) హోంగార్డు కిషన్ విధులు నిర్వహిస్తూ ఇటీవల గుండెపోటుతో మృతి చెందారు. ఆయన కుటుంబానికి సాగర్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న సీఐ,ఎస్ఐ, సిబ్బంది అందరూ కలిసి తమ వంతుగా కొంత మొత్తాన్ని సేకరించి రూ.91,500 నగదును కిషన్ భార్యకు సీఐ చేతులు మీదుగా అందజేశారు. కార్యక్రమంలో ఎస్ఐ ముత్తయ్య , సిబ్బంది రాజేశ్వరీ, జావీద్, లాలు, నరసింహ, కోటి, శంకర్, ప్రభు ఉన్నారు.

ప్రజా గొంతుకను గెలిపించాలి : సీపీఐ



వేములపల్లి సభలో మాట్లాడుతున్న బంటు వెంకటేశ్వర్లు

వేములపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడే ప్రజా గొంతుకైన అభ్యర్థులను స్థానిక ఎన్నికల్లో గెలిపించాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బంటు వెంకటేశ్వర్లు అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం ఏర్పాటు చేసిన పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐ తరుపున అన్నపరెడ్డిగూడెం, తిమ్మారెడ్డిగూడెం, మంగాపురం గ్రామాలకు సంబంధించి అభ్యర్థులను ఎంపిక చేశారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి జిల్లా యాదగిరి, నాయకులు పుట్టల నాగయ్య, మద్దిరాల రంగారెడ్డి, పుట్టల కృష్ణ, సుధాకర్, పరమేష్, భిక్షం, సంపత్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీతోనే గ్రామ స్వరాజ్యం

వేములపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బీజేపీతోనే గ్రామాలు అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి గ్రామ స్వరాజ్యం నెలకొంటుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాధినేని శ్రీనివాస్‌రావు అన్నారు. మండలంలోని శెట్టిపాలెం గ్రామంలో శుక్రవారం మండల ఎన్నికల ఇన్‌చార్జి బంటు సైదులు పర్యవేక్షణలో మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పార్టీ మండల అధ్యక్షుడిగా పెదమాం భరత్, ఉపాధ్యక్షులుగా పెదమాం ప్రసాద్, జిల్ల బోయిన సురేష్, పగిడిపల్లి సోమయ్య, లేకిరెడ్డి ప్రసాద్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శిగా నిమ్మల జాన్‌రెడ్డి, జెర్రిపోతుల శోభన్‌బాబు, కార్యదర్శులుగా శీలం లింగస్వామి, పందిరి రాజేష్, పెదమాం వెంకటేశ్వర్లు, శ్రీరామోజు మౌనిక, కోశాధికారిగా మాతంగి ప్రభాకర్‌ను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో కిసాన్ మోర్చా రాష్ట్ర నాయకులు జవ్వాజి సత్యనారాయణ, నాయకులు చలమల్ల సీతారాంరెడ్డి, కర్ర దామోదర్‌రెడ్డి, పెదమాం వెంకన్న పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్ గాయత్రీ యజ్ఞం

దేవరకొండ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): దేవరకొండ మద్దెలమ్మ తల్లి ఆలయంలో హనుమాన్ గాయత్రీ యజ్ఞం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ˆభక్తులు తెల్లవారుజామునే ఆలయానికి చేరుకొని గణపతి పూజ, సుప్రభాతసేవలు, ఆంజనేయ స్వామి మూలవిరాట్ విగ్రహానికి అభిషేక పూజలు నిర్వహించారు అనంతరం మండపారాధన, నవగ్రహ పూజలు, శ్రీహనుమాన్‌గాయత్రి యజ్ఞ మహోత్సవం నిర్వహించి పూజలు చేశారు. అనంతరం అన్నదానం చేపట్టారు. ఆలయ ప్రధాన అర్చకులు గంప ప్రవీన్‌కుమార్‌శర్మ, ఉప్పల శ్రీనివాస్‌శర్మ ఆధ్వర్యంలో పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు వడ్త్య రమేష్‌నాయక్, నల్లగాసు జాన్‌యాదవ్, నక్క వెంకటేష్ ఆలయ కమిటీ నిర్వాహకులు, మహిళలు పాల్గొన్నారు.



హనుమాన్ గాయత్రీ యజ్ఞంలో పాల్గొన్న మాలధారులు

నామినేషన్ల స్వీకరణకు క్లస్టర్ గ్రామాలివే..

● నిడమనూరు మండలంలో 29 పంచాయతీలకు 9 క్లస్టర్లు ● ఆర్వో, ఏఆర్వోల నియామకం

నిడమనూరు, నవంబరు 28 (ఆంధ్రజ్యోతి): మండలంలో డిసెంబరు 14న నిర్వహించనున్న రెండో విడత గ్రామ పంచాయతీ ఎన్నికలకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా నామినేషన్లు స్వీకరణకు క్లస్టర్ గ్రామాలు ఏర్పాటు చేయడంతో పాటు రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారులను కూడా నియమించారు. ఎన్నికలు సమర్థంగా నిర్వహించేందుకు మండలంలో 29 గ్రామ పంచాయతీలకు 9 క్లస్టర్ గ్రామాలు ఏర్పాటు చేయగా 10 మందిని రిటర్నింగ్ అధికారులు, మరో 11 మందిని సహాయ రిటర్నింగ్ అధికారులుగా నియమించారు. ఈనెల 30 నుంచి మూడు రోజుల పాటు నామినేషన్లు స్వీకరించనున్నారు. మండలంలో 29 పంచాయతీలకు 256 వార్డులు ఉన్నాయి. బంకాపురం క్లస్టర్ గ్రామంలో బంకాపురం, వెనిగండ్ల, సూరెపల్లి గ్రామా పంచాయతీలకు సంబంధించిన నామినేషన్లు స్వీకరిస్తారు. అదే విధంగా తుమ్మడం క్లస్టర్ గ్రామంలో తుమ్మడం, నారమ్మగూడెం, ఇండ్లకోటయ్యగూడెం పంచాయతీలు, రాజన్నగూడెం క్లస్టర్‌లో రాజన్నగూడెం, మార్లగడ్డక్యాంపు, పార్వతీపురం, వడ్డెరగూడెం, నిడమనూరు క్లస్టర్‌లో నిడమనూరు, శాఖాపురం, ముకుందాపురం క్లస్టర్‌లో ముకుందాపురం, వెంగన్నగూడెం, బొక్కమంతలపహాడ్, ముప్పారం క్లస్టర్‌లో ముప్పారం, గుంటుకగూడెం, సోమారిగూడెం, వేంపాడ్, ఊటుకూరు క్లస్టర్‌లో ఊటుకూరు, నందికొండవారిగూడెం, ఎర్రగూడెం, వెంకటాపురం, ఎర్రబెల్లి క్లస్టర్‌లో ఎర్రబెల్లి, బంటువారిగూడెం, మారుపాక, గుంటిపల్లి, రేగులగడ్డ క్లస్టర్‌లో రేగులగడ్డ, వల్లభాపురం గ్రామ పంచాయతీలకు సంబంధించిన నామినేషన్లు తీసుకుంటారు. ఈమేరకు అధికారులు ఏర్పాట్లు చేస్తున్నారు. మండలంలో పంచాయతీ ఎన్నికల నిర్వహణకు క్లస్టర్ గ్రామాలకు నియమించిన రిటర్నింగ్ (ఆర్వో), సహాయ రిటర్నింగ్ అధికారుల (ఏఆర్వో) వివరాలు కింది విధంగా ఉన్నాయి.

తిరుమలగిరి(సాగర్)లో..

తిరుమలగిరి(సాగర్) : గ్రామపంచాయతీ ఎన్నికలకు సంబంధించి నామినేషన్లు దాఖలు చేసేందుకు మండలంలోని పలు గ్రామాల్లో కేంద్రాలను అధికారులు ఏర్పాటు చేశారు. 35 గ్రామ పంచాయతీలకు 8 క్లస్టర్ గ్రామాలుగా ఏర్పాటు చేశారు. మండలంలోని చింతలపాలెం, బట్టువెంకన్నబావితండా, నాగార్జునపేట, సపావత్‌తండా, గోడుమడక గ్రామాలకు సంబంధించిన నామినేషన్లను చింతలపాలెం గ్రామపంచాయతీ భవనంలో సమర్పించాల్సి ఉంటుందని అధికారులు తెలిపారు. తిరుమలగిరి, రంగుండ్ల, తూటిపేటతండా, ఎల్లాపురం గ్రామాలకు సంబంధించి నామినేషన్లను మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో, కీచ్యాతండా, గరకనెట్‌తండా, తునికినూతల, తిమ్మాయిపాలెం, నాయకునితండాలకు సంబంధించిన నామినేషన్లను కీచ్యాతండా గ్రామపంచాయతీలో, అల్వాల, తెట్టెకుంట, శ్రీరాంపుర ం, పెద్దబావితండా నామినేషన్లను అల్వాల గ్రామపంచాయతీలో, కొంపల్లి, చిలకాపురం, ఎల్లాపురంతండా, సుంకిశాలతండా నామినేషన్లను కొంపల్లి గ్రామపంచాయతీలో, నెల్లికల్, జాల్‌తండా, చెంచువానితండా, ఎర్రచెరువుతండా, పిల్లిగుండ్లతండా నామినేషన్లను నెల్లికల్లు గ్రామపంచాయతీలో, నేతాపురం, మేగ్యాతండా, సీత్లతండా, ధన్‌సింగ్‌తండా నామినేషన్లను నేతాపురం గ్రామ పంచాయతీలో, రాజవరం, జువ్విచెట్టుతండా, బోయగూడెం, గట్టుమీదితండా నామినేషన్లను రాజవరం పంచాయతీ కార్యాలయంలో స్వీకరించనున్నట్లు ఎంపీడీవో తెలిపారు.

సోషల్ మీడియాలో రెచ్చగొట్టే పోస్టులు పెడితే చర్యలు

గుర్రంపోడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): స్థానిక సంస్థల ఎన్నికలపై సామాజిక మాధ్యమాల్లో రెచ్చగొట్టే పోస్టులు పెడితే కఠిన చర్యలు తీసుకుంటామని గుర్రంపోడు ఎస్ఐ పసుపులేటి మధు హెచ్చరించారు. పోచంపల్లి, కొప్పోలు గ్రామాల్లో శుక్రవారం ప్రజలకు అవగాహన కల్పించారు. సోషల్ మీడియాలో ఇతరుల మనోభావాలను దెబ్బతీసే విధంగా దుష్ప్రచారం చేసే వ్యక్తులపై చట్టపరమైన చర్యలుంటాయన్నారు. వాట్సాఫ్, ఫేస్‌బుక్, ట్విట్టర్, ఇన్‌స్ట్రామ్‌లలో ఇతరులను కించపరచవద్దన్నారు. ఏదైన వర్గాన్ని కించపరిచేలా పోస్టులు పెడితే నేరమన్నారు.



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ మధు

టీఎస్ యూటీఎఫ్ జిల్లా సమావేశం రేపు



తిరుమలగిరి (సాగర్) : పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు.

హాలియా,నవంబరు28(ఆంధ్రజ్యోతి): తిప్పర్తి మండల కేంద్రంలో ఈనెల 30వ తేదీన నిర్వహించనున్న టీఎస్ యూటీఎఫ్ జిల్లా విస్తృత కార్యవర్గ సమావేశాన్ని విజయవంతం చేయాల ఎంఈవో గుండా కృష్ణమూర్తి పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో శుక్రవారం కార్యవర్గ సమావేశ వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి రాచమళ్ల రమాదేవి, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కె.వెంకటరమణారెడ్డి, మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రవీందర్, సయ్యద్‌మియా, సునీత, వెంకట్‌రెడ్డి, చంద్రయ్య, నాగేశ్వర్ రావు పాల్గొన్నారు.

సమావేశం విజయవంతం చేయాలి

తిరుమలగిరి(సాగర్) : జరగనున్న టీఎస్‌యుటీఎఫ్ నల్లగొండ జిల్లా కమిటీ విస్తృత స్థాయి సమావేశాన్ని విజయవంతం చేయాలని సంఘం మండల ప్రధాన కార్యదర్శి రేవల్లి రాజేష్ కోరారు. శుక్రవారం మండల కేంద్రంలో సమావేశ పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలపై సమావేశంలో చర్చించనున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశానికి ఉపాధ్యాయులు అధిక సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో వినయ్‌కుమార్, జానిపాషా, బత్తిని శైలజ, విజయలక్ష్మి నరేషాచారి, నర్సింహారావు, అమరయ్య, సేవ్యరమణ, అమృతయ్య, రాములు, లక్ష్మీరాం, కుమారస్వామి, వెంకటేశ్వర్లు, స్వర్ణరేఖ తదితరులు పాల్గొన్నారు.

దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలి

● మాజీ ఎమ్మెల్యే నల్లమోతు బాస్కర్‌రావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించనున్న దీక్షా దివస్‌ను విజయవంతం చేయాలని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు కోరారు. స్థానిక రెడ్డి కాలనీలోని పార్టీ కార్యాలయ ం లో శుక్రవారం నిర్వహించిన ముఖ్యకార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. చావునోట్లో తలపెట్టి తెలంగాణ తెచ్చిన కేసీఆర్ దీక్ష చేపట్టిన దినోత్సవం సందర్భంగా రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలో నిర్వహించే కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు యడవెల్లి శ్రీనివాసరెడ్డి, అన్నభీమోజు నాగార్జునాచారి, పెద్ది శ్రీనివాస్‌గౌడ్, ఇలియాస్‌కాన్, మగ్దూం పాషా, మాజీద్, షెయబ్, పశ్య శ్రీనివాసరెడ్డి, దుర్గాప్రసాద్, వింజం శ్రీధర్, సాధినేని శ్రీనివాస్, పెరుమాళ్ల ధనమ్మ పాల్గొన్నారు.

తేమ, తూకం పేరుతో వసూలుపై విచారణ



కొనుగోలు కేంద్రం వద్ద విచారణ చేస్తున్న ఏపీడీ

త్రిపురారం, నవంబరు28(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని వెలుగు ఆధ్వర్యంలో మహిళా సమ భావన సంఘాలు నిర్వహిస్తు న్న ధాన్యం కొనుగోలు కేంద్రంలో ఏపీడీ శ్రవణ్‌కుమార్ శుక్రవారం విచారణ చేపట్టారు. 'తేమ, తూకాల పేరుతో వసూలు' అనే శీర్షికతో ఈ నెల 28న కథనం ప్రచురితమైంది. ఉన్నాతాధికారులు ఆదేశాల మేరకు ఏపీడీ ధాన్యం కొనుగోలులో జరిగిన అవకతవకలపై నిర్వాహకులు, రైతులను విచారించారు. నివేదిక తయారు చేసి ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ ప్రమీల, ఆర్ఐ సైదులు, ఏపీఎం నాగేందర్ తదితరులున్నారు.

వ్యక్తిత్వ వికాస పోటీల్లో వీటీనగర్ విద్యార్థి ప్రతిభ

చింతపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొడకొండ్ల గ్రామపంచాయతీలోని వేంకటేశ్వరనగర్ జడ్పీహెచ్ఎస్‌కు చెందిన రామగిరి కృష్ణసాయి వ్యక్తిత్వ వికాస పోటీల్లో ప్రథమ బహుమతి సాధి ంచారు. ఈ సందర్భంగా హెచ్ఎం కృష్ణవేణి మాట్లాడుతూ విద్యార్థులకు క్రమశిక్షణతో పాటు వారిలో దాగి ఉన్న ప్రతిభను వెలికి తీయడానికి ఇలాంటి పోటీలు నిర్వహించమన్నారు. కార్యక్రమంలో ఆధ్యాపకబృందం బాల్ రెడ్డి, కిరణ్‌కుమార్, నాజీయా శ్రీవాణి తదితరులు పాల్గొన్నారు.



కృష్ణసాయికి ప్రశంసాపత్రం అందజేస్తున్న అధ్యాపకులు

జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు కృషి చేయాలి



సాగర్ బీసీ గురుకుల పాఠశాలలో పూలే చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న ప్రిన్సిపాల్ రవికుమార్, సిబ్బంది

మిర్యాలగూడ టౌన్, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): జ్యోతిరావు పూలే ఆశయ సాధనకు యువత కృషి చేయాలని బీసీ సంక్షేమ సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు పోగుల సైదులుగౌడ్, సోషల్ వర్కర్ డాక్టర్ జాడి రాజు అన్నారు. శుక్రవారం పూలే వర్ధంతి సందర్భంగా సంఘం ఆధ్వర్యంలో ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పూలే చూపిన మార్గంలో పయనించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు దాసరాజు జయరాజు, చిరంజీవి సైదా పాల్గొన్నారు. అలాగే బీసీ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన పూలే వర్ధంతి సభలో జేఏసీ పట్టణ కన్వీనర్ బంటు వెంకటేశ్వర్లు, చేగొండి మురళీయాదవ్, ఎర్రబెల్లి దుర్గయ్య, సయ్యద్ ఫారూక్, నక్క యాదగిరి, గుద్దా రామకృష్ణ, అశోక్, మల్లయ్య సైదులు, నర్సింహ, జాను, మునీర్ పాల్గొన్నారు.

● దేవరకొండ : ప్రజా సంఘాలు, ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలోస్థానిక ప్రధానసెంటర్‌లో జ్యోతిరావుపూలే ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకుడు కంబాలపల్లి వెంకటయ్య, దేవరకొండ నియోజకవ`ర్గ ఇన్‌చార్జి సహదేవులు, స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జ్యోతిరావుపూలే చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎన్‌వీటీ, కార్యదర్శి శ్రీధర్‌గౌడ్, భాస్కర్‌రెడ్డి, వలమాల ఆంజనేయులు, వంగూరి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

● నాగార్జునసాగర్ : సాగర్ బీసీ గురుకుల పాఠశాలలో ప్రిన్సిపాల్ రవి కుమార్ సిబ్బందితో కలిసి పూలే చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. పైలాన్ కాలనీలో మాజీ కౌన్సిలర్ రమేష్‌జీ జెన్‌కో కార్యాలయం వద్ద ఉన్న పూలే విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో విక్రం, లక్ష్మణ్ నాయక్, రవి, శ్రీనివాసాచారి, గోపి నాయక్, నవీన్ నరసింహ పాల్గొన్నారు.



మిర్యాలగూడ పట్టణంలో జ్యోతిరావు పూలే చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న బీసీ సంఘాల నాయకులు

సర్పంచ్ అభ్యర్థి మీరే నిర్ణయించుకోండి

● నాయకులకు తలనొప్పిగా మారిన అభ్యర్థి ఎంపిక

● అధికార పార్టీ నుంచి పోటీ చేయడానికి ఎక్కువ మంది ఆసక్తి

డిండి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి) పంచాయతీలకు ఎన్నికలు నిర్వహించేందుకు రాష్ట్ర ప్రభుత్వం షెడ్యూల్ విడుదల చేసింది. దీంతో గ్రామాల్లో సర్పంచ్ బరిలో నిలిచే అభ్యర్థి ఎంపిక ప్రధాన పార్టీలకు తలనొప్పిగా మారింది. పోటీలో నిలిచేందుకు ఎక్కువ మంది ముందుకు రావడంతో నాయకులకు ఎవరిని ఎంపిక చేయాలో నాయకులకు తేల్చలేకపోతున్నారు. ఎంతో కాలానికి వచ్చిన అవకాశాన్ని జారవిడుచుకోవడానికి కొందరు ఒప్పుకోవడం లేదు. డిండి గ్రామపంచాయతీ సర్పంచ్ స్థానానికి 10 నుంచి 18 మంది ఆశావాహులు పోటీ చేసేందుకు సిద్ధపడుతున్నారు. ప్రధానంగా అధికార పార్టీకి ఈ సమస్య ఎదురైంది. ఇతర పార్టీల్లో కూడా ఈ సమస్యలేదని కూడ చెప్పలేము. గ్రామాలలో ఏకాభిప్రాయానికి రావాలని నాయకులు పదేపదే సూచిస్తున్న సమస్య కొలిక్కి రావడంలేదు. నామినేషన్ల పర్వం దగ్గరపడుతుండడంతో మరింత ఉత్కంఠ నెలకొంది. మండలంలోని కొన్ని గ్రామాల్లో తానే సర్పంచ్‌గా పోటీ చేస్తున్నానని ఇంటింటికి తిరిగి ప్రచారం మొదలుపెట్టారు. ఇదిలా ఉం డగా మండలంలోని 39 పంచాయతీల్లో బీసీలకు రెండు పంచాయతీలు కేటాయించడంతో అసంతృప్తితో ఉన్నారు.

నైట్‌వాచ్ ఉమెన్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దఅడిశర్లపల్లి, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): మండలంలోని దుగ్యాల మోడల్ స్కూల్ బాలికల వసతి గృహంలో నైట్‌వాచ్(మహిళ) పని చేయడానికి అర్హత గల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని ఎంఈవో వెంకటయ్య శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తుదారులు తమ సర్టిఫికెట్లు తీసుకుని డిసెంబరు 1వ తేదీలోపు ఎమ్మార్సీ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

నిరుపయోగంగా జనరేటర్లు



గుర్రంపోడు : తహసీల్దార్ కార్యాలయం సమీపంలో నిరుపయోగంగా ఉన్న జనరేటర్

గుర్రంపోడు, నవంబరు 28(ఆంధ్రజ్యోతి): విద్యుత్ కోతల సమయంలో కార్యాలయాలలో శాఖపరమైన పనులకు ఆటంకం కలుగకుండా ప్రభుత్వం పదేళ్ల క్రితం మండల కేంద్రంలోని కార్యాలయాలకు విద్యుత్ జనరేటర్లు సమకూర్చింది. అప్పట్లో ఒక్కొక్క జనరేటర్‌కు సుమారు రూ.2లక్షలు ఖర్చు చేశారు. కాగా వీటి నిర్వాహణ గురించి పట్టించుకోకపోవడంతో ఎండలో ఎండుతూ, వానలో తడుస్తూ తుప్పుపట్టి కార్యాలయాల వద్ద దిష్టిబొమ్మలుగా మారాయి. ఇలా ఒక్క గుర్రంపోడులోనే కాదు జిల్లాలోని పలు మండల కేంద్రాలలో ఈ పరిస్థితి నెలకొంది. అధికారులు దృష్టి సారించి వినియోగంలోకి తేవాలని ప్రజలు కోరుతున్నారు. మండలంలోని తహసీల్దార్, ఎంపీడీవో తదితర కార్యాలయాలలో కరెంట్ లేనప్పుడు పనులకు ఆటంకం ఏర్పడుతుండడంతో వినియోగదారులు ఇబ్బందులుపడుతున్నారు. యూపీఎస్ బ్యాటరీలతో కొద్దిసేపు మాత్రమే సేవలు అందుతున్నాయి. గుర్రంపోడులో ఇటీవల చెట్ల తొలగింపు, నూతన స్తంభాల ఏర్పాటు సమయంలో గంటలతరబడి కరెంట్‌లేక వివిధ గ్రామాల నుంచి కార్యాలయాలకు వచ్చిన ప్రజలు తీవ్ర ఇక్కట్ల పాలయ్యారు. ఇప్పటికైనా అధికారులు చొరవ చూపి జనరేటర్‌ను వినియోగంలోకి తేవాలని కోరుతున్నారు.

ఖర్చులు మీరే భరించాలి!

(5వ పేజీ తరువాయి)

స్థానిక నేతలకు అప్పగించి, వారి అనుయాయులున్నచోట్ల వారిని బరిలో ఉంచేలా సూచనలు, సలహాలు చేస్తున్నారు. బీఆర్ఎస్ నేతలు పార్టీ నాయకులు ఎవరు బరిలో నిలుస్తామంటే వారిని పోటీచేయాల్సిందిగా సూచిస్తున్నారు. మొత్తంగా ఏ పార్టీ అభ్యర్థి అయినా పోటీచేయాలంటే డబ్బును సొంతంగా సమకూర్చుకోవాల్సిందేనని తేల్చి చెబుతుండడంతో డబ్బుల్లేకుండా పార్టీల్లో పనిచేస్తున్న నాయకులు డైలమాలో పడి, అవకాశాలు వదులుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని సీనియర్లు, దీర్ఘకాలంగా రాజకీయాల్లో ఉన్నవారు వాపోతున్నారు.

విద్యుత్‌శాఖ టెండర్లలో గోల్‌మాల్ !

(5వ పేజీ తరువాయి)

పనులు అప్పగించినట్లు ఆరోపణలు వస్తున్నాయి. విద్యుత్‌శాఖలోని ఓ అధికారితో పాటు మరో ఇద్దరు అధికారుల బంధువులకే అప్పగించారని గుసగుసలు వినవిస్తున్నాయి. అయితే 15 రోజుల పాటు టెండర్లను వాయిదా వేసిన అధికారులు ఈ నెల 27 రాత్రే బినామీలకు, బంధువులకు పనులు అప్పగించినట్లు సమాచారం. ప్రభుత్వ ఖజానాకు గండిపడేలా, కాంట్రాక్టర్లకు లాభం చేకూరేలా వ్యహరిస్తూ పనులు అప్పగించడం వివాదానికి దారితీస్తోంది. దీనికి తోడు కొందరు కాంట్రాక్టర్లకు సమాచారం ఇవ్వకుండానే రాత్రిపూట టెండర్లు ఖరారు చేయడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. పనులు దక్కని కాంట్రాక్టర్లు ఉన్నతాధికారుల దగ్గరకు వెళ్లి నిబంధనలకు విరుద్ధంగా ఎలా వ్యవహరిస్తారని ప్రశ్నిస్తే రాజకీయ ఒత్తిడి అని సమాధానం ఇచ్చినట్లు తెలిసింది. ఓ అధికారి బదిలీ అయ్యాక కిందిస్థాయి అధికారులు టెండర్లను ఖరారు చేయడం, పాత తేదీలపై టెండర్లు ఇచ్చేలా వ్యవహారం నడిచినట్లు తెలిసింది. తక్కువ ధరకు పనులు చేస్తామని ముందుకు వచ్చిన కాంట్రాక్టర్లను కాదని అధిక ధరవేసి ప్రభుత్వ ఖజనాకు నష్టం వాటిల్లేలా చేస్తున్న వారికి ఇవ్వడంతో పాటు బంధువులకు అప్పగించడం చర్చనీయాంశంగా మారింది.

దీనిపై విద్యుత్‌శాఖ కమర్షియల్ ఏఈ శ్రీనివాసరావును 'ఆంధ్రజ్యోతి' వివరణ కోరగా ఇంకా ఏమి కాలేదంటూ వ్యాఖ్యానించడమేగాక, తాను డీఈ వద్ద ఉన్నానంటూ పూర్తి సమాచారం ఇవ్వకుండా తప్పించుకున్నారు. అయితే బదిలీ అయి హైదరాబాద్ వెళ్లిన డీఈ వద్దనే ఆయన ఉండటం కొసమెరుపు.